www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO. APTEL/2010/33229

TELANGANA RISING 2047

సంపుటి : 16 | సంచిక :247 | శుక్రవారం 14.11.2025 | ఎడిటర్ :కొమరాజు శ్రీనివాసులు | పేజీలు :08 | వెల : రూ 2/-




## ఇండియన్ మార్కెట్ కు గేట్ వే గా తెలంగాణ

చైనా ప్లస్ వన్ మోడల్ కు సమాధానమవుతం

మౌలిక సదుపాయాలలో హైదరాబాద్ టాప్

**సీఎం రేవంత్‌పై టెక్ దిగ్గజాల ప్రశంసలు**

వేగవంతమైన వృద్ధి రేటుతో ఉన్న రాష్ట్రం తెలంగాణ భారత దేశంలోనే నూతన నగరంగా మారుతుందని సీఎం 03

- త్వరలోనే ఫ్యూచర్ సిటీ నిర్మాణం
- కంపెనీలు స్థాపించాలని అమెరికా ప్రతినిధులకు ఆహ్వానం
- యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్షిప్ ఫోరంలో రేవంత్ రెడ్డి
- రేవంత్ విజన్ 2047 పై టెక్ దిగ్గజాల ప్రశంసలు
- తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కు వస్తామన్న టెక్ దిగ్గజాలు 02
- డిసెంబర్ 8,9న తెలంగాణలో జరగబోయే తెలంగాణ రైజింగ్ కు పూర్తి మద్దతు

## టార్గెట్ డిసెంబర్ 6

## 32 కార్లతో "బాబ్రీ మసీదు" కూల్చివేతకు ప్రతీకార కుట్ర..

- తీగలాగుతున్న దర్యాప్తు బృందాలు
- నలుగురు కలిసి పెద్ద ప్లానే వేశారు
- దేశవ్యాప్తంగా వరుస బాంబు దాడులకు కుట్ర
- ఎనిమిది మంది సూసైడ్ బాంబర్స్ రెడీ 02
- ఉగ్ర కుట్ర అమలు చేసే బాధ్యత ఉమర్‌పైనే
- యూనివర్సిటీ ల్యాబ్ నుంచి రసాయనాల సేకరణ
- ఉమర్, ముజ్మిల్ డైరీల్లో క్లియర్ గా ఉగ్ర ప్లాన్
- కెమికల్స్, డిజిటల్ పరికరాలు, పెన్ డ్రైవ్లు స్వాధీనం
- ఢిల్లీ లక్ష్యంగా టెర్రరిస్ట్ మాడ్యూల్ బిగ్ స్కెచ్ ఐదు
- దశల్లో కార్యాచరణ అమలుకు ప్లాన్ సుహ్,
- గురుగ్రామ్ నుంచి కెమికల్స్ పర్చేజ్ కదులుతున్న
- ఢిల్లీ ఎర్రకోట బాంబు పేలుడు డొంక

ఈ కేసులో పెద్ద కుట్ర ఉన్నట్లు విచారణలో వెల్లడైంది. డిసెంబర్ 6, బాబ్రీ మసీదు కూల్చివేత జరిగిన రోజున ప్రతీకారం తీర్చుకునేందుకు దాడులకు పాల్పడాలని ఉగ్రవాదులు భావించారు. దీని కోసం 32 కార్లను కూడా సిద్ధం చేసుకున్నారు. ఆరు దశల్లో ఒకేసారి బాంబు బ్లాస్ట్ చేయాలని ప్లాన్ చేశారు. ఢిల్లీలోని ఆరు వేర్వేరు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ప్రతీకారం తీర్చుకోవాలని అనుకున్నారు. ఈ కేసులో ఇప్పటి వరకు నాలుగు కార్లను గుర్తించారు. ఇవన్నీ పాత కార్లుగా తేలాయి. దాడులకు పాత కార్లను ఉగ్రవాదులు కొనుగోలు చేశారు. బ్రెజ్జా, స్విఫ్ట్, ఎకోస్పోర్ట్ కార్లను పోలీసులు గుర్తించారు. సోమవారం దాడి సమయంలో హ్యుందాయ్ ఐ20కారును ఉపయోగించారు. పోలీసులకు ట్రేస్ చేసినా దొరకుండా ఎక్కువ సార్లు చేతులు మారిన కార్లను ఉగ్ర డాక్టర్లు కొనుగోలు చేసినట్లు తెలిసింది.

**6 చోట్ల పేలుళ్లకు కుట్ర**

### ఉగ్రకుట్ర భగ్నం వెనుక మాస్టర్ బ్రెయిన్... 02




కారు నడిపింది ఉమర్ నబీయే.. డీఎన్ఏ టెస్టులో నిర్ధారణ

**ఢిల్లీ బ్లాస్ట్ కేసులో కీలక అరెస్టులు..**

- తవ్వేకొద్దీ ఉగ్ర కుట్ర కోణాలు బయటకు వస్తున్నాయి
- కార్డియాలజిస్ట్ మహ్మద్ ఆరిఫ్‌ను కాన్పూర్‌లో అరెస్ట్
- ఇటీవల అరెస్టైన డాక్టర్ షాహీన్‌తో దగ్గర సంబంధాలు
- టెర్రర్ మాడ్యూల్ ప్రకారం ఉమర్ మూడు కార్లు కొనుగోలు
- ఈ మూడు వాహనాల్లో పెద్ద ఎత్తున ఐఈడీలు 02

**అయోధ్య టార్గెట్..**

- ఉమర్ తదుపరి లక్ష్యం అయోధ్య అని తేల్చారు
- ఆలయ శిఖరంపై కాషాయ జెండాను ఎగురవేసే సమయంలో...
- ఫరీదాబాద్‌లో అమ్మోనియం నైట్రేట్, ఆర్డీఎక్స్ మిశ్రమాన్ని పెద్ద ఎత్తున స్వాధీనం
- ఢిల్లీలో పేలిన కారులో ఇవే ఉపయోగించారా? లేదా?



## సయ్యద్ ఇంట్లో గుజరాత్ ఏటీఎస్ పోలీసుల సోదాలు..

- అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యుల బృందం సోదాల్లో
- మూడు రకాల లిక్విడ్‌లతో పాటు కంప్యూటర్, పలు రకాల బుక్స్, ఆయిల్ తయారు చేసే మిషన్
- సయ్యద్ సోదరుడు ఓమర్ ఫారుఖీకి నోటీసులు ఇచ్చి సెర్చ్ 05

### మా వాళ్లకు శిక్షణ ఇవ్వండి




- H-1B వీసాలపై కొత్త విధానానికి ట్రంప్ ప్లాన్..
- అమెరికాకు వెళ్లి, స్థానికులకు ఇచ్చిన ఇచ్చి, వెళ్లిపోయేలా ప్రణాళిక.. 05
- అమెరికాకు రండి, మా వాళ్లకు శిక్షణ ఇవ్వండి, తిరిగి సొంత దేశానికి వెళ్లండి..

## గెలుపు ఎవరిది..?

**ఉదయం 11 కల్లా రిజల్ట్**

**10 రౌండ్లు..42 టేబుళ్లు**



- మొదటిగా పోస్టల్ బ్యాలెట్, తర్వాత షేక్ పేట డివిజన్
- యూసుఫ్ గూడ కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి
- కౌంటింగ్ విధుల్లో 186 మంది సిబ్బంది
- లెక్కింపు కేంద్రం వద్ద 250 మంది పోలీసులతో బందోబస్తు 03
- ఫలితాలు ఈసీ వెబ్ సైట్లో ఎప్పటికప్పుడు అప్డేట్
- 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం

| జూబ్లీహిల్స్ బైపోల్-2025 | |
|---|---|
| మొత్తం ఓట్లు | 4,01,365 |
| పోలైన ఓట్లు | 1,94,621 |
| అభ్యర్థుల సంఖ్య | 58 |

## రెవెన్యూ పెంచుకోవడానికి అవకాశాలు అన్వేషించాలి..

ఉప్పల్, ఫ్యూచర్ సిటీల్లోనూ ఏర్పాటు చేద్దాం

### ఆరాంఘర్ లో బస్ టెర్మినల్



- జేబీఎస్ మాదిరిగా నిర్మాణం చేపడుదాం
- మహాలక్ష్మి కింద 237 కోట్ల జీరో టికెట్ల జారీ
- కొత్త కాలనీలకూ బస్ సౌకర్యం కల్పించాలి
- నష్టాల్లో ఉన్న డిపోలు లాభాల బాట పట్టేలా చూడండి
- ఆర్టీసీ అధికారులతో సమీక్షలో మంత్రి పొన్నం
- ఆర్టీసీలో రెవెన్యూ పెంచుకోవడానికి అవకాశాలు అన్వేషించాలి.. 03

## హైదరాబాద్‌లోని ముస్లింలు నా వల్ల కోటీశ్వరులయ్యారు

### హైదరాబాద్ బిర్యానీకి బ్రాండ్ అంబాసిడర్ నేనే

- పాత బస్తి ముత్యాలను ప్రమోట్ చేసిన
- ఓల్డ్ సిటీ పక్కనే ఎయిర్పోర్ట్ కట్టించిన
- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు
- తన అభివృద్ధి వల్లే అక్కడి ముస్లింలు కోటీశ్వరులు అయ్యారని కామెంట్ 02




## సుప్రీంకోర్టులో ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణ

- ఫిరాయింపు ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టు విచారణకు రంగం సిద్ధం
- రాష్ట్ర రాజకీయాల భవిష్యత్తు నిర్ణయించే కీలక కేసు
- విచారణలో కేటీఆర్ ప్రస్తావనతో మరింత ప్రాధాన్యత
- పార్టీ మార్పులపై కొత్త ప్రమాణాలు సెట్ చేసే అవకాశం 03



## రాష్ట్ర వ్యాప్తంగా విజిలెన్స్ దాడులు..

### పలు జిల్లాల్లో రూ. 20.76 కోట్ల సీఎంఆర్ మాయం

- యథేచ్చగా ధాన్యం దారి మళ్లింపు
- రాష్ట్రవ్యాప్తంగా విజిలెన్స్ తనిఖీల్లో వెల్లడి 06
- మిల్లర్లపై చర్యలకు అధికారుల సిఫారసు



## పైలట్ ను నిందించలే..

- అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై సుప్రీంకోర్టుకు కేంద్రం క్లారిటీ
- ఒకేసారి రన్ మోడ్ నుంచి కటాఫ్ కి మారడం వల్లే ప్రమాదం
- ప్రాథమిక విచారణ ఆధారంగా పైలట్లను నిందించడం దురదృష్టకరమని మండిపడింది 05



## ఇందిరమ్మ ఇళ్లు త్వరగా నిర్మిస్తే బిల్లులు వేగంగా మంజూరు..

**'ప్రజల సొమ్ము దోపిడికి గురైతే అది అత్యంత ప్రమాదకరం'**


**విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యత...మన బిడ్డల భవిష్యత్తు మన భవిష్యత్తు**


మహిళా డైరీ దేశానికి ఆదర్శం

యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రతి నియోజకవర్గంలో జాబ్ మేళాలు

- రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినా ఎలాంటి ఇబ్బంది లేకుండా సరఫరా
- 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు ఇస్తున్నది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇళ్లు ఎంత త్వరగా నిర్మించుకుంటే,
- అంత వేగంగా బిల్లులు మంజూరు
- ఐదు సంవత్సరాల్లో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చడం లక్ష్యమని చెప్పారు 03

## కేసు వాపస్ తీసుకున్న నాగర్జున





Daily Status
In The Court Of :Spl. JFCM For Excise Cases.
CNR Number. :TSHM0A0565532024
Case Number. :CC/0000490/2024
Nagarjuna Akkineni Versus Konda Surekha
Date :13-11-2025

| | | |
|---|---|---|
| Business | : | Accused called absent. Petition filed and it is allowed. CrIMP was dismissed as not pressed. Complainant called absent. Petition filed and it is allowed. He filed a petition U/s 280 of BNSS and informed virtually that he is withdrawing the case. Hence the case was dismissed as withdrawn. |
| Nature of Disposal | : | WITHDRAWN |
| Disposal Date | : | 13-11-2025 |

- నాగార్జున ఫ్యామిలీపై కాంట్రవర్సీ కామెంట్లు
- రెండు సార్లు క్షమాపణలు చెప్పిన మంత్రి
- పిటిషన్ విత్ డ్రా చేసుకున్న నాగ్
- కొండా సురేఖకు భారీ ఊరట.. కేసు వాపస్ తీసుకున్న నాగర్జున 02

మంత్రి కొండా సురేఖకు భారీ ఊరట దక్కింది. ఆమె మీద నాగార్జున వేసిన పరువు నష్టం దావా కేసును వాపసు తీసుకున్నాడు. దీంతో కొండా సురేఖ ఓ పెద్ద సమస్య నుంచి బయట పడ్డట్టు అయింది. ఈ నిర్ణయం ప్రస్తుతం రాజకీయ, సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మంత్రి కొండా సురేఖ స్వయంగా క్షమాపణలు చెప్పడంతో నాగార్జున ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

# టార్గెట్ డిసెంబర్ 6

## కారు నడిపింది ఉమర్ నబీయే.. డీఎన్ఏ టెస్టులో నిర్ధారణ

**న్యూఢిల్లీ:** ఢిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడు ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఘటనలో మరో కీలకమైన విషయం బయట పడింది. ఎర్రకోట వద్ద పేలుడు జరిపిన డాక్టర్ ఉమర్ నబీ డీఎన్ఏ నిర్ధారణ అయింది. ఉమర్ నబీ తల్లి డీఎన్ఏ నమూనాతో సరిపోలినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. కారు స్టీరింగ్, యాక్సిలరేటర్ మధ్య ఇరుకున్న కాలు నుంచి డీఎన్ఏ సేకరించినట్లు పోలీసులు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఎర్రకోట సమీపంలో 12 మంది ప్రాణాలు కోల్పోయి, అనేక మంది గాయపడిన పేలుడులో పాల్గొన్న ఐ20 కారును డాక్టర్ ఉమర్ నబీ భట్ నడిపారు. అల్-ఫలాహ్ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న ఉమర్ తన హ్యుందాయ్ ఐ20 తో పాటు మరో వాహనం, ఎరుపు రంగు ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కలిగి ఉన్నారని కనుగొన్న తర్వాత ఢిల్లీ పోలీసులు బుధవారం హెచ్చరిక జారీ చేశారు. పుల్వామాలోని కోయిల్ గ్రామానికి చెందిన ఉమర్, ఫరీదాబాద్ లోని ధౌజ్ లోని అల్ ఫలాహ్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సెంటర్ లో ఉద్యోగం చేస్తున్నాడు.

**నాలుగు నగరాల్లో ఇద్దరు చొప్పున పేలుళ్లకు కుట్ర: దర్యాప్తు సంస్థలు**

4 ప్రాంతాల్లో వరస పేలుళ్లలో ప్రణాళిక రచించినట్లు దర్యాప్తు బృందాలు వెల్లడించాయి. నాలుగు నగరాల్లో ఇద్దరు చొప్పున పేలుళ్లకు కుట్ర పన్నారని దర్యాప్తు సంస్థలు తెలిపాయి. ప్రతి గ్రూప్ నుంచి భారీగా ఐఈడీ తీసుకెళ్లాలని నిర్ణయించారని అధికారులు తెలిపారు. దర్యాప్తు సంస్థల సమాచారం ప్రకారం పేలుళ్లకు ఎనిమిది మంది అనుమానితులు కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. భద్రతా కారణాల దృష్ట్యా లాక్ ఖిలా మెట్రో స్టేషన్ మూసివేశారు. తదుపరి నోటీసులు వచ్చే వరకు లాల్ ఖిలా మెట్రో స్టేషన్ మూసివేయబడుతోందని అధికారులు పేర్కొన్నారు. లాల్ ఖిలా మెట్రో స్టేషన్ మినహా అన్ని స్టేషన్లు యథావిధిగా పనిచేస్తాయని అధికారులు సూచించారు.

**ఢిల్లీలో సంచరించిన ఉగ్రవాది, 50 చోట్ల సీసీటీవీలో చిక్కాడు**

ఎర్రకోట పేలుడు వెనుక ఉన్న బాంబర్ మార్గాన్ని పోలీసులు మ్యాప్ చేశారు. డాక్టర్ ఉమర్ మొహమ్మద్, అలియాస్ డాక్టర్ ఉమర్ ఉన్-నబి సోమవారం సాయంత్రం పేలుడుకు ముందు ఢిల్లీ అంతటా ప్రయాణించారని, డజన్ల కొద్దీ సీసీటీవీ కెమెరాలు అతన్ని గుర్తించాయని వర్గాలు తెలిపాయి. ఫరీదాబాద్ నుండి పారిపోయిన తర్వాత అతను తీసుకున్న మార్గాన్ని మ్యాప్ చేయడానికి పోలీసులు విజువల్స్ రూపొందించారు. ఫరీదాబాద్ నుంచి పారిపోయి, మొదట హర్యానాలోని మేవాట్ మీదుగా ఫిరోజ్ పూర్ ఝిర్కా చేరుకున్నాడు. ఆ తర్వాత ఢిల్లీ-ముంబై ఎక్స్ ప్రెస్ వేలో ప్రయాణించాడు. ఆ రాత్రి ధాబాలో గడిపి కారులోనే పడుకున్నాడు. మరుసటి రోజు ఉదయం ఢిల్లీకి తిరిగి వచ్చాడు. సోమవారం ఉదయం 8:13 గంటలకు అతను బాదర్ పూర్ టోల్ దాటుతున్నట్లు సీసీటీవీ కెమెరాల్లో కనిపించింది. ఢిల్లీలోని దాదాపు 50 ప్రదేశాలలో డాక్టర్ ఉమర్ సీసీటీవీలో చిక్కాడు. అతను ఉదయం నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు నగరం చుట్టూ తిరిగాడని సూచిస్తుంది.ఢిల్లీలో, అతను మొదట తూర్పు జిల్లాలో కనిపించాడు. తరువాత అతను సెంట్రల్ జిల్లాలోని రింగ్ రోడ్ వరకు, తరువాత ఉత్తర జిల్లాకు ప్రయాణించాడు. అతను భోజనం కోసం నార్త్ వెస్ట్ జిల్లాలోని అశోక్ విహార్ లో ఆగాడు. ఆ తర్వాత అతను సెంట్రల్ జిల్లాలోని ఒక మసీదును సందర్శించాడని వర్గాలు సూచిస్తున్నాయి. డాక్టర్ ఉమర్ మధ్యాహ్నం 3:19 గంటలకు నార్త్ జిల్లాలోని ఎర్రకోట పార్కింగ్ స్థలానికి చేరుకున్నారు. ఢిల్లీలో తిరుగుతున్నప్పుడు, ఆ వాహనం కన్నాట్ ప్లేస్, మయూర్ విహార్ లలో కూడా కనిపించింది. తరువాత అతను దానిని చాందినీ చౌక్ లోని సునేహ్రీ మసీదు పార్కింగ్ స్థలంలో పార్క్ చేశాడు. ఉదయం 6:30 గంటల వరకు కారు పార్కింగ్ లోనే ఉందని, ఉమర్ ఒక్క క్షణం కూడా కారును వదిలి వెళ్ళలేదని నివేదికలు సూచిస్తున్నాయి. ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో సాయంత్రం 6:52 గంటల ప్రాంతంలో నెమ్మదిగా కదులుతున్న ట్రాఫిక్ లో కారు పేలుడు సంభవించిన విషయం తెలిసిందే.

**అల్‌ఫలాహ్ వర్సిటీ కేంద్రంగా టెర్రర్ ప్లాన్.. బాంబుల తయారీ అక్కడే**

ఢిల్లీ బాంబ్ బ్లాస్ కేసు విచారణలో భాగంగా సంచలన విషయాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. తాజాగా, మరో విషయం అందరినీ అవాక్కయ్యేలా చేస్తోంది. అయితే, ఉగ్ర కుట్ర నిందితులు ఫరీదాబాద్‌లోని అల్‌ఫలాహ్ యూనివర్సిటీ కేంద్రంగానే టెర్రర్ అటాక్ ప్లాన్ చేసినట్లుగా ఇన్వెస్టిగేషన్ టీమ్స్ గుర్తించాయి. క్యాంపస్ పరిధిలోనే గుట్టుచప్పుడు కాకుండా ఐఈడీ బాంబులు తయారు చేసినట్లుగా సమాచారం. వర్సిటీలోని రూమ్ నెంబర్.13లో పేలుడుకు అవసరమైన సామగ్రితో బాంబులు తయారు చేశానట్లు దర్యాప్తు సంస్థలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి.కాగా, బాంబ్ బ్లాస్ట్ కోసం డాక్టర్ ఉమర్, షహీన్, ఆదిల్ కలిసి రూ.26 లక్షలు సమీకరించినట్లుగా విచారణలో వెల్లడైంది. రూ.3 లక్షలతో గురుగ్రామ్, నూహ్ ప్రాంతం నుంచి 20 క్వింటాళ్ల NPK ఎరువులు కొనుగోలు చేశారని.. ఆ ఎరువుతో అమ్మోనియం నైట్రేట్ ఆధారిత ఐఈడీ బాంబులు తయారీ చేశారని తెలుస్తోంది. సిగ్నల్ యాప్ ద్వారా డాక్టర్ ఉమర్ నలుగురు సభ్యులతో గ్రూప్‌ను తయారి చేసినట్లుగా వెల్లడైంది. అయితే, బాబ్రీ మసీదును కూల్చేసిన రోజు మొత్తం ఢిల్లీ వ్యాప్తంగా 6 నుంచి 7 ప్రాంతాల్లో రివేంజ్ అటాక్స్‌కు ముష్కరులు ప్లాన్ చేశారని అధికారులు వెల్లడించారు. మొత్తం ఐదు ఫేజ్‌లుగా టెర్రర్ ప్లాన్ చేశారని అందులో మొదటగా టెర్రల్ మాడ్యూల్ ఏర్పరచడం, భారీగా బ్లాస్ట్ మెటీరియల్‌ను సేకరించడం, ఐఈడీని తయారు చేయడం, నిర్ధారించిన లొకేషన్లలోకి ఐఈడీ బాంబులను చేరవేయడం, కొ-ఆర్డినేషన్‌తో వరుస పేలుళ్లకు పాల్పడటమే లక్ష్యంగా ఆ నలుగురు పక్కాగా ప్లాన్ చేసినట్లుగా దర్యాప్తులో వెల్లడైంది.

**అల్-ఫలాహ్ యూనివర్సిటీకి ఎదురుదెబ్బ.. న్యాక్ షోకాజ్ నోటీసులు**

ఢిల్లీ బాంబ్ పేలుడు నేపథ్యంలో ఫరీదాబాద్ అల్-ఫలాహ్ యూనివర్సిటీకి ఎదురుదెబ్బ తగిలింది. తప్పుడు ప్రచారంతో మోసగించినందుకు యూనివర్సిటీకి న్యాక్ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. న్యాక్ గుర్తింపు లేకుండానే వైబ్‌సైట్‌లో మాత్రం కళాశాలకు గుర్తింపు ఉందంటూ బహిరంగంగా ప్రదర్శించింది. ఈ నేపథ్యంలో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసినందుకు గాను సమాధానం ఇవ్వాలంటూ న్యాక్ నోటీసులు పేర్కొంది.తప్పుడు సమాచారంతో తల్లిదండ్రులు, విద్యార్థులను తప్పుదారి పట్టించడమే అవుతుందని తన నోటీసుల్లో న్యాక్ పేర్కొంది. 76 ఎకరాల్లో విశాలంగా అల్-ఫలాహ్ యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటైంది. హర్యానా ప్రైవేటు యూనివర్సిటీల చట్టం కింద దీన్ని ఏర్పాటు చేశారు. 1997లో ఇంజినీరింగ్ కాలేజీగా మొదలైంది. 2013లో యూజీసీకి చెందిన నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (నాక్) నుంచి 'ఏ' గ్రేడ్ అందుకున్నట్లుగా మీడియా కథనాలు పేర్కొన్నాయి. 2014లో హర్యానా రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీ హోదా కల్పించింది. అనుబంధంగా 2019లో అల్-ఫలా మెడికల్ కాలేజీని ఏర్పాటు చేశారు.ఢిల్లీ బ్లాస్ట్ తర్వాత అల్-ఫలాహ్ కేంద్రంగా జరిగిన ఉగ్ర కుట్ర బయటపడింది. ముగ్గురు వైద్యులు దేశ వ్యాప్తంగా భారీ దాడులకు కుట్రపన్నారు. ఇందులో ప్రధానంగా డాక్టర్ ఉమర్ ఉన్నారు. ఇతడి నేతృత్వంలోనే ఈ కుట్రకు ప్లాన్ జరిగింది. సోమవారం సాయంత్రం 6:50 గంటల ప్రాంతంలో ఎర్రకోట దగ్గర కారు వెళ్తుండగా ఒక్కసారిగా పేలిపోయింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు 13 మంది చనిపోగా.. పలువురు గాయపడ్డారు. ఇక ఉమర్ ఉపయోగించిన మూడు కార్లను గుర్తించారు.

**32 కార్లతో "బాబ్రీ మసీదు" కూల్చివేతకు ప్రతీకార కుట్ర..**

ఈ కేసులో పెద్ద కుట్ర ఉన్నట్లు విచారణలో వెల్లడైంది. డిసెంబర్ 6, బాబ్రీ మసీదు కూల్చివేత జరిగిన రోజున ప్రతీకారం తీర్చుకునేందుకు దాడులకు పాల్పడాలని ఉగ్రవాదులు భావించారు. దీని కోసం 32 కార్లను కూడా సిద్ధం చేసుకున్నారు. ఆరు దశల్లో ఒకేసారి బాంబు బ్లాస్ట్ చేయాలని ప్లాన్ చేశారు. ఢిల్లీలోని ఆరు వేర్వేరు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ప్రతీకారం తీర్చుకోవాలని అనుకున్నారు. ఈ కేసులో ఇప్పటి వరకు నాలుగు కార్లను గుర్తించారు. ఇవన్నీ పాత కార్లుగా తేలాయి. దాడులకు పాత కార్లను ఉగ్రవాదులు కొనుగోలు చేశారు. బ్రెజ్జా, స్విఫ్ట్, ఎకోస్పోర్ట్ కార్లను పోలీసులు గుర్తించారు. సోమవారం దాడి సమయంలో హ్యుందాయ్ ఐ20కారును ఉపయోగించారు. పోలీసులకు ట్రేస్ చేసినా దొరకకుండా ఎక్కువ సార్లు చేతులు మారిన కార్లను ఉగ్ర డాక్టర్లు కొనుగోలు చేసినట్లు తెలిసింది.ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారును పోలీసులు హర్యానా ఫరీదాబాద్‌లో గుర్తించారు. బ్రెజ్జా కారును మహిళా వైద్యురాలు షాహినా సయీద్ వాడినట్లు పోలీసులు కనుగొన్నారు. ఈమెనే జైషే మహ్మద్ ఉగ్రసంస్థ మహిళా విభాగానికి ఇండియాలో హెడ్‌గా పనిచేస్తున్నట్లు అనుమానిస్తున్నారు. బ్రెజ్జా కారును హర్యానాలోని ఫరీదాబాద్‌లోని అల్-ఫలా స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సెంటర్ క్యాంపస్‌లో గుర్తించారు. ఈ కేసులో ఉగ్రవాద డాక్టర్లు- ఆదిల్ అహ్మద్ రాథర్, ముజమ్మిల్ షకీల్, సాహినా సయీద్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

# విద్యార్థులకు మంత్రి పొంగులేటి కీలక సూచనలు

**కూసుమంచి,ఫ్లాష్ ఇండియా :** తల్లిదండ్రుల, గురువుల పట్ల ఎల్లప్పుడూ మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం కూసుమంచి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఇన్ స్పైర్ అండ్ ఇగ్నైట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కూసుమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థిని, విద్యార్థులకు గురువారం నిర్వహించిన వ్యక్తిగత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. రంజిత్ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు నిర్వహించిన నైపుణ్య అభివృద్ధి శిక్షణకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. వజ్రం కూడా సాన పెడితే విలువ తెలుస్తుందని, అదే విధంగా తల్లిదండ్రుల, గురువుల మీద మనకు ఉన్న ప్రేమ గుర్తుకు వచ్చేలా, మనలోనీ భావోద్వేగాలను రంజిత్ బృందం తట్టి లేపారని అన్నారు.అమ్మ నాన్నల ప్రేమ చాలా గొప్పదని, మనం గురువులకు ఇవ్వాల్సిన గౌరవాన్ని రంజిత్ చాలా చక్కగా వివరించారని, ఇదే రీతీలో పాలేరు నియోజకవర్గంలోని ప్రతి మండలంలో నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయాలని అన్నారు. రంజిత్ బృందం అందించే కాన్సెప్ట్ రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు ముఖ్యమంత్రితో కూడా చర్చిస్తానని మంత్రి పేర్కొన్నారు. మనల్ని నిస్వార్థంగా ప్రేమించేది అమ్మ నాన్న, గురువులు మాత్రమేనని మంత్రి తెలిపారు. నేడు విద్యాసంస్థల్లో అనేకమంది పిల్లలు, యువకులు డ్రగ్స్ ఇతర చెడు అలవాట్లకు బానిసలు అవుతున్నారని, డ్రగ్స్ భూతం నిర్మూలనకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని, పిల్లలు చెడు అలవాట్ల వైపు ఎట్టి పరిస్థితిలో చూడవద్దని మంత్రి సూచించారు.పెరెంట్స్ పెట్టుకున్న ఆశలను గుర్తు చేసుకుంటూ జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్య సాధనకు విద్యార్థులు కృషి చేయాలని మంత్రి సూచించారు. భవిష్యత్తులో ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, తల్లిదండ్రులు మనపై పెట్టుకున్న నమ్మకం నిలబెట్టుకోవాలని అన్నారు.అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ,మానవతా విలువలు, మనుషులలో సున్నితత్వం మేల్కొల్పాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం సఫలీకృతమైందని అన్నారు. కెరియర్లో పెద్ద స్థాయికి చేరుకోవడం ఎంత ముఖ్యమో మనం అందరం మనుషులుగా విలువలతో జీవించడం అంతే ముఖ్యమని అన్నారు.మంచి సామర్థ్యం గల యువత చెడు మార్గంలో ప్రయాణించడం వల్ల వినాశనం వైపు వెళ్తున్నారని అదనపు కలెక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. చదువుతో పాటు మంచి విలువలు, సంస్కారం కలిగి ఉండటం చాలా కీలకమని అన్నారు. అనంతరం పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా జూనియర్ కళాశాలలో చదువుతున్న 34 మంది బాలికలకు మంత్రి సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఎంఈఓ రాయల.వీరస్వామి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ బ్లాస్ట్ కేసులో కీలక అరెస్ట్‌లు..

**న్యూఢిల్లీ:** ఢిల్లీ పేలుడుపై దర్యాప్తు కొనసాగుతోంది. దర్యాప్తులో అనేక కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తవ్వేకొద్దీ ఉగ్ర కుట్ర కోణాలు బయటకు వస్తున్నాయి. ఉగ్రవాది ఉమర్ కు సంబంధించిన విషయాల్లో అంతర్జాతీయంగా జరిగిన కుట్ర వెలుగులోకి వచ్చింది.ఇక దర్యాప్తులో భాగంగా కీలక అరెస్ట్ లు జరిగాయి. ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూల్ లో భాగంగా జమ్మూకాశ్మీర్ కు చెందిన కార్డియాలజిస్ట్ మహ్మద్ ఆరిఫ్ ను కాన్పూర్ లో అరెస్ట్ చేశారు. ఇటీవల అరెస్టైన డాక్టర్ షాహీన్ తో దగ్గర సంబంధాలు ఉన్నట్లుగా తేలింది. వీరిద్దరూ నిత్యం టచ్ లోనే ఉన్నట్లుగా దర్యాప్తు అధికారులు కనిపెట్టారు.అలాగే ఫహీమ్ అనే మరొక వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఖండ్వాలీ ప్రాంతంలో ఎరుపు రంగు ఎకోస్పోర్ట్స్ కారును పార్కు చేసిన వ్యక్తిగా గుర్తించి ఫరీదాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఫహీమ్.. ప్రధాన నిందితుడు డాక్టర్ ఉమర్ నబీ బంధువుగా గుర్తించారు.టెర్రర్ మాడ్యూల్ ప్రకారం ఉమర్ మూడు కార్లు కొనుగోలు చేశాడు. హ్యుందాయ్ ఐ20, ఎరుపు రంగు ఫోర్డ్ ఎకోస్పోర్ట్, మారుతి బ్రెజ్జాలను కొనుగోలు చేశాడు. ఈ మూడు కారుల్లో సోమవారం సాయంత్రం ఎర్రకోట దగ్గర హ్యుందాయ్ i20 కారు పేలిపోయింది. ఇక రెండో ఎరుపు రంగు కారును తాజాగా స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఢిల్లీ రిజిస్ట్రేషన్ నంబర్ 0458 కలిగిన ఎకోస్పోర్ట్ ను ఫరీదాబాద్ లో ట్రాక్ చేశారు. ఇక మూడో కారు మారుతి బ్రెజ్జా కోసం గాలిస్తున్నారు. దీని కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ఈ మూడు వాహనాల్లో పెద్ద ఎత్తున ఐఈడీలు పెట్టుకుని భారీ దాడులు చేయాలని.. అంతేకాకుండా అస్సాల్ట్ రైఫిల్స్ తో విచక్షణారహితంగా కాల్పులు కూడా జరపాలని ఉమర్ ప్లాన్ చేసుకున్నట్లుగా దర్యాప్తు సంస్థలు కనుగొన్నాయి.

**అయోధ్య టార్గెట్..**

ఇక ఉమర్ తదుపరి లక్ష్యం అయోధ్య అని తేల్చారు. నవంబర్ 25, 2025న అయోధ్య రామాలయంలో 'ధ్వజారోహణం' (జెండా ఎగురవేత) వేడుకతో పాటు ఆలయ శిఖరంపై కాషాయ జెండాను ఎగురవేసే సమయంలో ఉమర్ దాడి చేయాలని ప్లాన్ వేసుకున్నట్లు దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు.ఇక ఫరీదాబాద్ లో అమ్మోనియం నైట్రేట్, ఆర్డీఎక్స్ మిశ్రమాన్ని పెద్ద ఎత్తున దర్యాప్తు బృందం స్వాధీనం చేసుకుంది. ఇది మిలిటరీ-గ్రేడ్ పేలుడు పదార్థాలకు సంబంధించిందిగా తేల్చారు. ఢిల్లీలో పేలిన కారులో ఇవే ఉపయోగించారా? లేదా? అనేది ఫోరెన్సిక్ బృందాలు తేల్చనున్నాయి.ఇక ఈ కుట్రంతా టర్కీ కేంద్రంగా జరిగినట్లుగా కనిపెట్టారు. 2022లో రూపొందించిన ప్రణాళికగా దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఇక ఉమర్.. ప్రస్తుతం 'ఉకాసా' అనే కోడ్ నేమ్ తో పిలవబడుతున్నాడు. టర్కీలోని హ్యాండ్లర్లు.. ఉమర్ ను 'ఉకాసా'గానే పిలుస్తారు. ఉమర్ నెట్ వర్క్ పై దర్యాప్తు సంస్థలు దృష్టిపెట్టినప్పుడు ఈ అంతర్జాతీయ సంబంధాలు వెలుగులోకి వచ్చాయి.

# ఇండియన్ మార్కెట్ కు గేట్ వే గా తెలంగాణ

**ఢిల్లీ :** ప్రపంచ పెట్టుబడిదారులకు తెలంగాణ రాష్ట్రంలో అద్భుత అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గత 35 ఏళ్లుగా కాంగ్రెస్ తో పాటు ఇతర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు ప్రోత్సాహం అందిస్తూనే ఉన్నాయని చెప్పారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న రేవంత్ రెడ్డి ఇవాళ అక్కడ జరిగిన యూఎస్-ఇండియా వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ మల్టీ నేషనల్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం అయ్యారు. తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యానికి ఈ సమావేశంలో భారీ స్పందన లభించింది. ఈ సందర్భంగా మాట్లాడిన ముఖ్యమంత్రి.. తాను భారతదేశంలోనే అత్యంత యువ, ఉత్సాహవంతమైన విజయవంతమైన రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్నానని చెప్పారు. తెలంగాణ భౌగోళికంగా దేశం మధ్యలో ఉండటమే కాకుండా ఇక్కడ ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు లేవని అద్భుతమైన వాతావరణం, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. తెలంగాణ ఇండియన్ మార్కెట్ కు గేట్ వే లాంటిందని ఇప్పుడు హైదరాబాద్ గ్లోబల్ కంపెనీలుక ప్రధాన కేంద్రంగా ఎదిగిందన్నారు. అందువల్ల తెలంగాణలో ఇన్వెస్ట్ చేయాలని పిలుపునిచ్చారు.


**హైదరాబాద్ రోడ్లకు కార్పొరేట్ కంపెనీల పేర్లు:**

గత 23 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తమ జీవన ప్రమాణాలతో హైదరాబాద్ ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దిందనని ప్రధానంగా మహిళల ఆర్థిక సాధికారత, ఉత్తమ్ విద్య, నైపుణ్యాభివృద్ధిపై మా ప్రభుత్వం ఫోకస్ పెట్టిందని చెప్పారు. ఈ సందర్భంగా ప్రపంచంలోని ప్రముఖ విద్యా సంస్థలను ఇక్కడికి ఆహ్వానించిన రేవంత్ రెడ్డి.. హార్వర్డ్, స్టాన్ ఫర్డ్, ఆక్స్ ఫర్డ్ వంటి విశ్వవిద్యాలయాలు హైదరాబాద్ లో తమ క్యాంపస్ ను ఏర్పాటు చేస్తే గ్లోబల్ సౌత్ విద్యార్థులు తక్కువ ఖర్చుతో సులభ వీసాతో విద్యను పొందగలరని అభిప్రాయం వ్యక్తం చేశారు. 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ దేశంలోనే అత్యంత ఆధునిక నగరంగా రూపుదిద్దుకుంటోందని మూసీ నది పునరుద్ధరణ తర్వాత లండన్, టోక్యో, దుబాయ్, సియోల్ నగరాల తరహాలో అభివృద్ధి చెందుతుందని ఇది నైట్ ఎకానమీకి పెద్ద ఊతం ఇవ్వబోతోందని చెప్పారు. డ్రై పోర్ట్, హైదరాబాద్ మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు, ఆర్ఆర్ఆర్-ఓఆర్ఆర్ మధ్య మ్యానుఫ్యాక్చరింగ్ జోన్ ప్రాజెక్టులను ఈ సందర్భంగా ప్రస్తావించారు. చైనా+1 కు ప్రత్యామ్నాయంగా ప్రపంచానికి సమాధానం ఇవ్వగలిగే రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. ఇకపై హైదరాబాద్ లోని ముఖ్యమైన రోడ్లకు కార్పొరేట్ కంపెనీల పేర్లు పెట్టబోతున్నామని సీఎం చెప్పారు. ఇప్పటి వరకు రాజకీయ నాయకుల పేర్లతో రోడ్లు ఉండగా ఇకపై గూగుల్, మెటా టీసీఎస్, ఇన్ఫోసిస్ వీధులు చూడబోతున్నామని తెలిపారు.

**తెలంగాణ రైజింగ్ కు మా మద్దతు: యూఎస్ఐఎస్ పీఎఫ్**

యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరం అధ్యక్షుడు, సీఈఓ డా.ముఖేష్ అఘీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పిలుపు మేరకు డిసెంబర్ 8,9న తెలంగాణలో జరగబోయే తెలంగాణ రైజింగ్ కు పూర్తి మద్దతు ఇస్తున్నామని చెప్పారు. USISPF సభ్యుల్లో ఎక్కువ మంది ఈ ఈవెంట్ లో పాల్గొంటామని చెప్పారు. సిస్కో మాజీ సీఈఓ, టెక్ దిగ్గజం జాన్ చాంబర్స్ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి దృష్టి ధైర్యవంతమైనది, స్పష్టమైనది, చాలా సాధ్యమైనది అని వ్యాఖ్యానించారు. తన పూర్తి మద్దతును సీఎంకు ప్రకటించారు. రేవంత్ రెడ్డి వివరించిన గేమ్ ఛేంజర్ ప్రాజెక్టులు, వాటి సామాజిక ప్రభావం చాలా ప్రభావవంతంగా ఉన్నాయన్నారు.

# కేసు వాపస్ తీసుకున్న నాగర్జున



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మంత్రి కొండా సురేఖకు భారీ ఊరట దక్కింది. ఆమె మీద నాగార్జున వేసిన పరువు నష్టం దావా కేసును వాపసు తీసుకున్నాడు. దీంతో కొండా సురేఖ ఓ పెద్ద సమస్య నుంచి బయట పడ్డట్టు అయింది. ఈ నిర్ణయం ప్రస్తుతం రాజకీయ, సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మంత్రి కొండా సురేఖ స్వయంగా క్షమాపణలు చెప్పడంతో నాగార్జున ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. నేడు నాంపల్లి స్పెషల్ కోర్టులో నాగార్జున వేసిన పరువు నష్టం దావా కేసుపై విచారణ జరిగింది.అయితే మంత్రి కొండా సురేఖ ఇప్పటికే రెండు సార్లు నాగార్జున ఫ్యామిలీకి క్షమాపణలు చెప్పడంతో నాగార్జున కేసు విత్ డ్రా చేసుకున్నారు. 2024 అక్టోబరు 2న హైదరాబాద్ లోని లంగర్ హౌస్ లో మంత్రి కొండా సురేఖ మీడియాతో మాట్లాడుతూ.. నాగచైతన్య, సమంత విడాకులు కావడానికి కారణం మాజీ మంత్రి కేటీఆర్ అని వివాదాస్పద వ్యాఖ్యలు చేసింది. ఆ వ్యాఖ్యలపై నాగార్జున ఫ్యామిలీ తీవ్ర స్థాయిలో ఫైర్ అయింది. సినీ ఇండస్ట్రీ మొత్తం మంత్రి వ్యాఖ్యలను ఖండించింది. ఆమె వ్యాఖ్యలపై నాగార్జున BNS సెక్షన్ 356 కింద క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పిటిషన్ వేశారు. ఇప్పటికే రెండు సార్లు విచారణకు నాగార్జున, కొండా సురేఖ హాజరయ్యారు. దీన్ని పెద్దది చేసుకోవద్దనే ఉద్దేశంతో కొండా సురేఖ నిన్న మరోసారి ఎక్స్ లో క్షమాపణలు చెప్పండో కేసు వాపసు తీసుకున్నాడు నాగార్జున.

# హైదరాబాద్‌లోని ముస్లింలు నా వల్ల కోటీశ్వరులయ్యారు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ లోని ఓల్డ్ సిటీ ముస్లింలు తన వల్ల కోటీశ్వరులయ్యారని సీఎం చంద్రబాబు అన్నారు. ఇవాళ ఆయన విశాఖలో ఓ సమావేశంలో మాట్లాడుతూ.. తాను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో సీఎంగా ఉన్న నాడు హైదరాబాద్ అభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యం ఇచ్చానని అన్నారు. సమస్యాత్మక ప్రాంతమైన ఓల్డ్ సిటీ పక్కనే దూరదృష్టితో ఆనాడే ఎయిర్ పోర్టును ఏర్పాటు చేశామని తెలిపారు. సిటీ చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు వేస్తే.. ఓల్డ్ సిటీ పరిధిలోని ముస్లింలు అంతా కోటీశ్వరులు, లక్షాధికారులు అయ్యారని గుర్తు చేశారు. హైదరాబాద్ పర్యటనకు విదేశీ ప్రముఖులు ఎవరు వచ్చినా ఓల్డ్ సిటీకి వెళ్లి షాపింగ్ చేసే విధంగా పెరల్స్ (ముత్యాలను) ప్రమోట్ చేసింది తానేనని అన్నారు. హైదరాబాద్ బిర్యానీని కూడా ప్రపంచ వ్యాప్తంగా ప్రమోట్ చేసిన చరిత్ర తమదని పేర్కొన్నారు. నగరంలో నిరుపయోగంగా పడి ఉన్న ఫలక్ నుమా ప్యాలెస్ ను నిజాం సంస్కృతిని కాపాడేలా అందులో బ్రహ్మాండమైన హోటల్ ను పెట్టి దానిని కూడా పరిరక్షించామని సీఎం చంద్రబాబు అన్నారు.

# ఉగ్రకుట్ర భగ్నం వెనుక మాస్టర్ బ్రెయిన్...



**ఢిల్లీ :** ఢిల్లీ ఎర్రకోట పేలుడు ఘటనతో దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ ఘటనను సీరియస్ గా తీసుకున్న ప్రభుత్వం ముమ్మరంగా దర్యాప్తు జరిపి.. ఢిల్లీ లక్ష్యంగా టెర్రరిస్ట్ మాడ్యూల్ వేసిన బిగ్ స్కెచ్ ను భగ్నం చేసింది. ఐదు దశల్లో దేశవ్యాప్తంగా టెర్రరిస్ట్ మాడ్యూల్ కార్యాచరణ అమలు చేసేందుకు ప్లాన్ చేసినట్లు గుర్తించింది ప్రభుత్వం. ఈ ఉగ్రకుట్ర భగ్నం వెనుక మాస్టర్ బ్రెయిన్ మన తెలుగు ఆఫీసరే.. ఈ కేసుకు సంబంధించి మొదట లీడ్ ఇచ్చింది కర్నూలుకు చెందిన సందీప్ చక్రవర్తి అని సమాచారం. సందీప్ చక్రవర్తి ప్రస్తుతం శ్రీనగర్ SSPగా ఉన్నారు.పహల్గాం ఎటాక్ తర్వాత చేపట్టిన మహదేవ్ ఆపరేషన్ లోనూ సందీప్ చక్రవర్తి కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం. జైషే మహమ్మద్ పోస్టర్లను మొదట గుర్తించిన సందీప్.. పోస్టర్లు అంటించిన వారిని సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. ముగ్గురు నిందితులపై గతంలో స్టోన్ పెల్టింగ్ కేసులు ఉన్నట్లు గుర్తించిన సందీప్ అండ్ టీం.. సోఫియాన్, ఇర్ఫాన్ అహ్మద్ లను అరెస్ట్ చేసి రెండు వారాల పాటు విచారించారు.వాళ్లు ఇచ్చిన సమాచారంతోనే డాక్టర్ల టెర్రర్ ప్లాట్ బయటికి వచ్చింది.ఈ క్రమంలో దర్యాప్తు ముమ్మరం చేసిన అధికారులు డాక్టర్స్ టెర్రర్ మాడ్యుల్ లో ఇప్పటిదాకా తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. ఫరీదాబాద్ తనిఖీల్లో 358 కేజీ పేలుడు పదార్థంతోపాటు 2563 కేజీల సామాగ్రిని స్వాధీనం చేసుకున్న జమ్మూ కాశ్మీర్ పోలీసులు..రెండు సంవత్సరాలుగా ఈ సామాగ్రిని సమకూర్చినట్లు గుర్తించారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా
మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# సహాయ నిధిని సద్వినియోగం చేసుకోండి

**షాద్ నగర్,ఫ్లాష్ ఇండియా :** ఆపదలో ఉన్నవారిని ఆదుకునే ఆపద్భాంధవు సీఎం రిలీఫ్ ఫండ్ అని షాద్ నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఫరూఖ్ నగర్, కొందుర్గు, జిల్లేడు చౌదరిగుడా మండలాలకు చెందిన 58 మంది లబ్దిదారులకు రూ.26 లక్షల 58 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. ప్రజలకు అండగా ఉండే ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమని అన్నారు. పేద ప్రజలకు వైద్య సహాయం అందించేందుకు ఆరోగ్యశ్రీతో పాటు సీఎం రిలీఫ్ ఫండ్ ఆదుకుంటుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉదార స్వభావంతో ప్రైవేటు ఆసుపత్రులలో అత్యవసర చికిత్స చేయించుకున్న వారికి సైతం సీఎం రిలీఫ్ ఫండ్ తో ఆదుకుంటుందని పేర్కొన్నారు.సీఎం రిలీఫ్ ఫండ్ నిరంతరం కొనసాగే ప్రక్రియ అని, అర్హులైన, అవసరం ఉన్న ప్రతి ఒక్కరు సీఎం రిలీఫ్ ఫండ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఫరూఖ్ నగర్, కొందుర్గు, జిల్లేడు చౌదరి గూడెం మండల పార్టీ అధ్యక్షులు చల్లా శ్రీకాంత్ రెడ్డి, కృష్ణారెడ్డి, చలివేంద్ర గూడెం రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బలరాజ్ గౌడ్, నేతలు అగ్గనూర్ బస్వం, చెంది తిరుపతి రెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, చంద్రశేఖర్, శ్రీనివాస్, ఆంజనేయులు, ఖదీర్, ముబారక్ అలీ ఖాన్, బాల గంగాధర్ తిలక్, రమేష్ గౌడ్, సోలిపూర్ అనిల్, ప్రదీప్ ముదిరాజ్, శ్రీధర్ గౌడ్, రవికుమార్ ముదిరాజ్, పాషా, తదితరులు పాల్గొన్నారు.

# భక్తుల ఇబ్బందులను పట్టించుకోరా..?



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** కొండగట్టు దేవస్థానంలో ఆర్జిత సేవల రుసుమును భారీ పెంచడం పట్ల కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఇవాళ ఓ ప్రకటనను విడుదల చేశారు. కొండగట్టు ఆలయంలో కనీస సౌకర్యాలు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మొదట మౌలిక వసతుల కల్పన మీద ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ఆలయ అభివృద్ధిని విస్మరించడమే కాకుండా ఆర్జిత సేవా రుసుము పేరుతో అడ్డగోలుగా ధరలు పెంచడమేంటని ప్రశ్నించారు. అనంతరం ఆయన దేవాదాయ శాఖ అధికారులతో ఫోన్ లో మాట్లాడి.. ఆర్జిత సేవా రుసుము పెంపుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. భక్తులు ఇబ్బందులను పట్టించుకోరా.. అని ప్రశ్నించారు. తక్షణమే పెంచిన ఆర్జిత సేవా రుసుమును తగ్గించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# మలావత్ పూర్ణకు కేటీఆర్ ఫోన్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ , మాజీ మంత్రి కేటీఆర్ గురువారం ఎవరెస్ట్ అధిరోహకురాలు మలావత్ పూర్ణకు ఫోన్ చేసి మాట్లాడారు. అతి చిన్న వయసులో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి గిరిపుత్రికగా పేరు తెచ్చుకున్న మలావత్ పూర్ణ తండ్రి దేవీదాస్ కన్నుమూయడంతో, కేటీఆర్ ఆమెను ఓదార్చారు. కేటీఆర్ ప్రస్తుతం జూబ్లీహిల్స్ ఎన్నికల బిజీలో ఉన్నప్పటికీ, ఈ విషాద వార్త తెలుసుకుని వెంటనే నిజామాబాద్ జిల్లా, సిరికొండ మండలం, పాకాల గ్రామంలో ఉన్న పూర్ణకు కాల్ చేశారు. పూర్ణ తండ్రి మరణం పట్ల ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పూర్ణకు ధైర్యం చెప్పిన కేటీఆర్, త్వరలోనే స్వయంగా వచ్చి ఆమె కుటుంబాన్ని కలవనున్నట్లు హామీ ఇచ్చారు.కాగా.. మలావత్ పూర్ణ 13 ఏళ్ల వయసులో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించారు. అతి పిన్న వయస్కురాలిగా ప్రపంచ రికార్డు సృష్టించారు. ఏడు ఖండాలలోని అత్యంత ఎత్తైన పర్వతాలను అధిరోహించిన ఏకైక భారతీయ మహిళగా నిలిచారు.

# ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు లాంటివి

**వెంకటాపూర్(రామప్ప),ఫ్లాష్ ఇండియా :** ములుగు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని, ములుగు పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్నదని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క)అన్నారు. రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ ముందుకు సాగుతున్నదని అన్నారు. గురువారం వెంకటాపూర్ మండలంలోని పాలంపేట రామప్ప సరస్సులో రూ.13 కోట్ల రూపాయల నిధులతో చేపట్టిన ద్వీపం అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డిలతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రామప్ప సరస్సులో శివుడి విగ్రహం ఏర్పాటు చేయడానికి నిధులు మంజూరు చేయడం జరిగిందని, చెరువు మధ్యలో 20 ఎకరాల స్థలం ఉండగా ఏడు ఎకరాలలో టూరిజం శాఖ దీని నిర్మాణం చేపట్టిందని వివరించారు.రామప్ప సరస్సులో ఎంత నీరు వచ్చినా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు పూర్తి చేయడం జరుగుతుందని, సహజ సిద్ధమైన ఈ ప్రాంతంలో ఆధ్యాత్మికంగా యోగ, పూజలు, శివతాండవ నృత్యాలు చేసుకోవడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ఎనిమిది వందల సంవత్సరాల చరిత్ర కలిగిన రామప్పకు ఇప్పటికే యునెస్కో గుర్తింపు వచ్చిందని, ఆలయ సమీపంలో ఆడిటోరియం నిర్మాణం పూర్తి కావడమే కాకుండా ఆలయాల పునరుద్ధరణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని తెలిపారు. ములుగు మండలం ఇంచర్ల గ్రామ సమీపంలో రూ.35 కోట్ల రూపాయలతో హంపి థియేటర్ ను ఏర్పాటు చేసి హస్తకళల తయారీకి అవకాశం కల్పించడం జరుగుతుందని, రూ.150 కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా పాఠశాల భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని అన్నారు. అదే ప్రాంతంలో విలేజ్ పార్క్ తో పాటు నూనె తయారు చేసే కంపెనీ ఏర్పాటు కాబోతున్నదని, గోవిందరావుపేట మండలం లక్నవరం సరస్సులో మరికొన్ని ఐలాండ్ లా నిర్మాణం ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు.తాడువాయి మండలం మేడారంలోని సమ్మక్క సారలమ్మ గద్దెల పున నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, మంగపేట మండలం మల్లూరులోని లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని వివరించారు. బోగత జలపాతం వద్ద పర్యాటకులపై నీరు పడే విధంగా వంతెనలను ఏర్పాటు చేయబోతున్నామని, బ్లాక్ బెర్రీ తిరిగి ప్రారంభించడం జరిగిందని అన్నారు. ములుగు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో సిసి రోడ్ల ఏర్పాటుతో పాటు లింకు రోడ్ల పనులను పూర్తి చేయడం జరిగిందని, ఆయా గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచామని అన్నారు. వచ్చే డిసెంబర్ కాలానికి తాము అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామని, ప్రజా సంక్షేమం, ప్రభుత్వ అభివృద్ధి తమకు రెండు కలలాంటివని తెలిపారు.గత పది సంవత్సరాల కాలంలో ములుగు నియోజకవర్గ ఇలాంటి అభివృద్ధికి నోచుకోలేదని, తాము అధికారంలోకి వచ్చిన అనంతరమే విద్య, వైద్యం, అభివృద్ధి, పర్యాటక ప్రాంతం అభివృద్ధి చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రాష్ట్రంలోనే ములుగు జిల్లాను అభివృద్ధిలో ముందు స్థానంలో నిలిచేలా కృషి చేస్తున్నామని, కాకతీయులు, సమ్మక్క సారక్క తిరిగిన ఈ ప్రాంతం ఎంతో చరిత్ర కలిగి ఉందని వివరించారు. అభివృద్ధి కార్యక్రమాలను చురుకుగా కొనసాగించి భావితరాల వారికి అందిస్తామని, తాము చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని సీతక్క కోరారు. రామప్ప సరస్సులో మరో శివుని విగ్రహం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టూరిజం ఇంజనీరింగ్ డిఈ ధనరాజ్, ఏ ఈ విజయ్, తహసీల్దార్ గిరిబాబు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు

# గెలుపు ఎవరిది..?

**10 రౌండ్లలో జూబ్లీహిల్స్ కౌంటింగ్..**

**వివరాలు వెల్లడించిన ఆర్వీ కర్ణన్**

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఓట్ల లెక్కింపు రేపు యూసఫ్గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో ఉదయం 8 గంటలకు ప్రారంభం అవుతుందని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ తెలిపారు. తొలుత బ్యాలెట్ ఓట్లు లెక్కించి ఆ తర్వాత ఈవీఎంలలోని ఓట్లను లెక్కిస్తామని తెలిపారు. ఇవాళ మీడియాతో మాట్లాడిన ఆయన..10 రౌండ్లలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేస్తామని సాధారణంగా ఓట్ల లెక్కింపుకు 14 టేబుల్స్ ఏర్పాటు చేయాల్సి ఉంటే ఇక్కడ స్పెషల్ పర్మిషన్ తో ఈసారి 42 టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో 1,94,631 (48.49శాతం) ఓట్లు పోలయ్యాయని 407 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని తెలిపారు.కౌంటింగ్ ప్రక్రియలో 186 మంది సిబ్బంది పని చేస్తారని అందులో కౌంటింగ్ సూపర్వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్తో పాటు ప్రతి టేబుల్ వద్ద మైక్రో అబ్జర్వర్ కూడా ఉంటారని తెలిపారు. కౌంటింగ్ను ఎప్పటికప్పుడు ఆర్వో పరిశీలిస్తారని వెల్లడిచారు.కౌంటింగ్ కేంద్రానికి అభ్యర్థులు, ఏజెంట్లకు తప్ప మిగతా వారికి అనుమతి లేదని తెలిపారు. ఫలితాలను ఈసీ వెబ్ సైట్ https://results.eci.gov.in/లో ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తామని, మీడియా కోసం ఫలితాలను కౌంటింగ్ కేంద్రం వద్ద ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కౌంటింగ్కు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని, కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు స్పెషల్ అధికారిని నియమించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా జాయింట్ సీపీ ఇక్బాల్ మాట్లాడుతూ.. రేపటి కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని విభాగాల పోలీసు బృందాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కౌంటింగ్ కేంద్రం వద్ద కూడా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# సీఎం రేవంత్‌పై టెక్ దిగ్గజాల ప్రశంసలు

**ఢిల్లీ :** అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, పరిశ్రమలకు అనువైన వాతావరణం, భద్రతకు ఎటువంటి ఢోకా లేకుండా భౌగోళికంగా కేంద్ర స్థానంలో ఉన్న హైదరాబాద్ ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారుల కు ఉత్తమ గమ్యస్థానమని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. దేశంలోనే పెద్ద సంఖ్యలో యువత , వేగవంత మైన వృద్ధి రేటుతో ఉన్న రాష్ట్రం తెలంగాణ అని ముఖ్యమంత్రి అన్నారు. ఢిల్లిలో గురువారం జరిగిన అమెరికా సంయుక్త రాష్ట్రాలు-భారతదేశం వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సులో (USISPF) ముఖ్య మంత్రి ప్రసంగించారు. తెలంగాణలో గత 35 ఏళ్లుగా కాంగ్రెస్తో పాటు అనేక పార్టీలు ప్రభుత్వాలకు సారథ్యం వహించినా పెట్టుబడులకు, పెట్టుబడిదారులకు అందరూ మద్దతుగా నిలిచారని వివరించారు. భారతదేశంలో పెట్టుబ డుల కు హైదరాబాద్ ముఖ ద్వార మని సీఎం తెలిపారు. జీసీసీలకు గ్యమ స్థానంగా ఉన్న హైదరాబాద్ లో పెట్టుబడులకు ముందుకు రావాలని సీఎం పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు.మహిళా సాధికారిత , నాణ్య మైన విద్య , యువతకు నైపుణ్య శిక్ష ణ , పట్టణాభివృద్ధితో పాటు మెరుగైన వసతులు, అత్యున్నత జీవన ప్రమాణాల తో కూడిన అంత ర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్నునిల పడమే తన ప్రథమ ప్రాధాన్యత అని తెలిపారు. గత 23 నెలల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అద్భుత మైన మౌలిక వ స తులతో 30 వేల ఎక రాల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో భారత్ ఫ్యూచర్ సిటీ భారత దేశంలోనే నూతన నగరంగా మారుతుంద ని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మూసీనదీ పునరుజ్జీవనం పూర్తయితే లండన్, టోక్యో, దుబాయి, సియోల్ రివర్ ఫ్రంట్ ల మాదిరే హైదరాబాద్ నైట్ ఎకానమీ కొత్త దశలోకి ప్రవేశిస్తుంద ని సీఎం అన్నారు. డ్రై పోర్ట్, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్లు, ORR–RRR మధ్య మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ వంటి కీలక ఇన్ ఫ్రా ప్రాజెక్టుల పురోగతిని వివరించిన సీఎం రేవంత్ రెడ్డి.. చైనా +1 మోడల్ కు గ్లోబల్ సమాధానం తెలంగాణ అవుతుంది" అని అన్నారు.హార్వర్డ్, స్టాన్ ఫోర్డ్, ఆక్స్ ఫర్డ్ వంటి ఐవీ లీగ్ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్ లో ఆఫ్ షోర్ క్యాంపస్లు ఏర్పాటు చేస్తే తక్కువ ఖర్చు, సులభమైన వీసా విధానాలతో దక్షిణాది దేశాల (గ్లోబ ల్ సౌత్ ) విద్యార్థుల కు నాణ్య మైన విద్య లభిస్తుందని ప్రపంచ స్థాయి విద్యా సంస్థలను ఆహ్వానించారు. భారతదేశంలో రోడ్ల కు ఎక్కువగా నేతల పేర్లు ఉంటాయని.. హైదరాబాదులో ఆ ట్రెండ్ ను మార్చాల ని తాము అనుకుంటున్నామ ని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ముఖ్య మైన రోడ్లకు గూగుల్, మెటా, టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి కంపెనీ పేర్ల ను పెడతామని సీఎం అన్నారు. సదస్సు ప్రారంభంలో తెలంగాణరైజింగ్ 2047 విజన్ ను ప్రదర్శించారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యం ఢిల్లీలో జరిగిన US-India Strategic Partnership Forum (USISPF) వార్షిక సమావేశంలో విశేష ఆదరణ పొందింది. గ్లోబల్ ఇన్వెస్టర్లకు పెట్టుబడుల అవకాశాలు వివరించిన సీఎం ప్రసంగం, అంతర్జాతీయ వ్యాపార వర్గాలను ఆకట్టుకుంది.రేవంత్ రెడ్డి విజన్ బోల్డ్, క్లియర్, అచీవబుల్ అని టెక్ దిగ్గజం, సిస్కో మాజీ సీఈఓ జాన్ ఛాంబ ర్స్ ప్రశంసించారు. రేవంత్ రెడ్డి తెలంగాణ విజన్ పార ద ర్శ కంగా, సాహ సోపేతంగా (బోల్డ్), సాధించగ లిగేలా ఉంది. ఆయన చెప్పిన ప్రాజెక్టులు, వాటి సామాజిక ప్రభావం ఎంతో ప్రేరణాత్మకంగా ఉంది.

**గ్లోబల్ సమ్మిట్ కు హాజర వుతాం: డాక్టర్ ముఖేష్ ఆఘి, USISPF అధ్యక్షుడు**

ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానం మేరకు మా సభ్యులలో అత్య ధికులం డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్ లో జరిగే TelanganaRising గ్లోబల్ సమ్మిట్ కు హాజ ర వుతాం. తెలంగాణ విజన్ ను దగ్గరగా తెలుసుకోవాలని మేమంతా ఆసక్తిగా ఉన్నాం.

# సుప్రీంకోర్టులో ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణ



**ఢిల్లీ :** తెలంగాణ రాజకీయాల్లో మరో ఉత్కంఠ భరిత ఘట్టం మొదలైంది.. పార్టీ మారిన ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు సోమవారం సుప్రీంకోర్టులో విచారణకు రానుంది. ఈ కేసు రాష్ట్ర రాజకీయ భవిష్యత్తును, శాసనసభ పటిష్టతను ప్రభావితం చేయనుంది అనడంలో సందేహం లేదు. గతంలో ఒక పార్టీ నుంచి గెలిచి, మరో పార్టీలో చేరిన ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టు ఎలాంటి తీర్పు ఇస్తుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ కేసులో కీలక పార్టీ అయిన BRS వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రస్తావన కూడా ఉండడం, ఈ విచారణకు మరింత ప్రాధాన్యతను తీసుకొచ్చింది.సోమవారం విచారణకు రానున్న ఈ కేసులో.. ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై రాజకీయ వర్గాల్లో భారీ ఉత్కంఠ నెలకొంది. ఈ తీర్పు.. భవిష్యత్తులో రాజకీయ నాయకులు పార్టీలు మారే విధానాన్ని, ఫిరాయింపులకు పాల్పడే ధోరణిని పూర్తిగా మార్చేసే అవకాశం ఉంది. కేసు యొక్క ప్రాధాన్యత నేపథ్యంలో... BRS వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రస్తావన కూడా ఈ అంశంలో కీలకమవుతోంది. ఈ విచారణ తర్వాత.. సుప్రీంకోర్టు ఇవ్వబోయే తుది తీర్పు.. ఫిరాయింపులను ప్రోత్సహించే పార్టీలకు, ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలకు ఒక కఠినమైన హెచ్చరికగా మారుతుందో లేదో వేచి చూడాలి.

# రెవెన్యూ పెంచుకోవడానికి అవకాశాలు అన్వేషించాలి..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ప్రభుత్వం నుండి నెల వారిగా వస్తున్న మహాలక్ష్మి టికెట్ ఆదాయమే కాకుండా అదనపు ఆదాయంపై దృష్టి సాధించాలని టీజీఆర్టీసీ ఉన్నతాధికారులను మంత్రి పొన్నం ఆదేశించారు. సచివాలయంలో ఆర్టీసీ ఉన్నతాధికారులతో ఇవాళ పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్టీసీలో ఇప్పటి వరకు మహిళలాలు 237 కోట్ల జీరో టికెట్ ఉపయోగించుకున్నారని, ఇందుకు సంబంధించిన 7,980 కోట్ల రూపాయలు ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించిందని చెప్పారు. టికెట్ ఆదాయంతో పాటు టికెట్ యేతర ఆదాయంపై దృష్టి సారించారని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలు డిపోలు నష్టాల బారిన ఉండడానికి గల కారణాలు, స్థానిక పరిస్థితులు ఆయా డిపోలు లాభాల బాట పట్టడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేయడానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డిని మంత్రి ఆదేశించారు. నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ప్రయాణికులకు అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచుకునేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని, పీఎం ఈ -డ్రైవ్ కింద హైదరాబాద్కు కేటాయించిన 2 వేల బస్సులు విడతల వారిగా రానుండడంతో అందుకు సంబంధించిన చార్జింగ్ స్టేషన్లు, మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.

**కొత్త కాలనీలకు బస్సులు:**

నగరంలో కొత్త కాలనీలు పెరుగుతున్న నేపథ్యంలో డిమాండ్కు అనుగుణంగా ఆ రూట్లోల బస్సులను నడిపించేలా స్థానిక డీఎం ఇతర ఆర్టీసీ అధికారులు ఆయా ప్రాంతాల్లో పర్యటించి ఒక నివేదికను రూపొందించి బస్సులు నడిపేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గంలోని కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ప్రాంతాన్ని మంత్రి ప్రస్తావించారు. ఇటువంటి ప్రాంతాల్లో ప్రయాణికుల డిమాండ్ ఉన్న నేపథ్యంలో బస్సులు నడిపించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు 578 బస్సులు కొత్తగా రాష్ట్రంలో రోడ్డెక్కాయని త్వరలో మరిన్ని కొత్త బస్సులు రానుండడంతో వాటిని ప్రయాణికుల ట్రాఫిక్ ఎక్కువగా ప్రాంతాల్లో నడిపించాలని సూచించారు.

**త్వరలో ఉద్యోగ నోటిఫికేషన్:**

ఇప్పటికే ఆర్టీసీలో 1000 ఆర్టీసీ డ్రైవర్లు,743 శ్రామిక్ పోస్టులకు పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఇచ్చిన నోటిఫికేషన్ ప్రస్తుతం ఇంటర్వ్యూ దశలో ఉందని ఈ నియామకాలు వేగంగా పారదర్శకంగా జరిగేలా పూర్తి చేయాలని మంత్రి తెలిపారు. వచ్చే డిసెంబర్ చివరిలోపు 84 ట్రాఫిక్ సూపర్వైజర్ ట్రైనీ, 114 సూపర్వైజర్ ట్రైనీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల కానుందని ఈ నియామక ప్రక్రియ టీజీపీఎస్సీ లేదా పోలీస్ బోర్డు ద్వారా నియమించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కారుణ్య నియామకాల కింద చేరిన ఆర్టీసీ కండక్టర్లకు ఉన్న మూడు సంవత్సరాల ప్రొవిజన్ రెండు సంవత్సరాలకు తగ్గించేలా పరిశీలించాలని అధికారులకు సూచించారు. మేడారం జాతర సమీపిస్తుండటంతో ములుగు బస్ స్టేషన్ నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

**ఫోర్త్ సిటీ లో బస్ టెర్మినల్:**

సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఫోర్త్ సిటీలో బస్ టెర్మినల్ నిర్మాణం, బస్ సౌకర్యాలపై ఆర్టీసీ ఉన్నతాధికారులు అధ్యయనం చేయాలని అధికారులను పొన్నం ఆదేశించారు. నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కొత్త డిపోలకు అవసరమైన స్థల పరిశీలన చేసి జిల్లా కలెక్టర్ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వానికి అందించాలని తెలిపారు. నగరంలో నలువైపుల బస్ స్టేషన్లు ఉండేలా జేబీఎస్ మాదిరి ఆరంఘర్లో అధునాతన బస్సు టెర్మినల్ నిర్మించడానికి ఆర్టీసీ, పోలీస్ శాఖకు సంబంధించిన భూ బదలాయింపు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఉప్పల్ కూడా బస్ టెర్మినల్ నిర్మించడానికి అధ్యయనం చేయాలన్నారు. రవాణా శాఖ సీజ్ చేసిన వాహనాలు బస్సు డిపోలో చాలా కాలంగా పేరుకుపోవడంతో వారికి సమయం ఇచ్చి వేలం వేయాలని సూచించారు.

**డ్రైవర్ మానిటరింగ్ సిస్టం:**

ఆర్టీసీలో ప్రమాదాలను తగ్గించడానికి తొలి దశలో లహరి, రాజధాని, గరుడ బస్సుల్లో అమలవుతున్న డ్రైవర్ మానిటరింగ్ సిస్టం పని తీరును ఈ సందర్భంగా మంత్రి అడిగి తెలుసుకున్నారు. దీని ద్వారా డ్రైవర్ నిద్ర ఉపక్రమించే సూచనలు కానీ, మొబైల్ వాడుతున్నప్పుడు మానిటరింగ్ చేస్తూ అప్రమత్తం చేస్తుంది. ఇక ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లకు నిరంతరం శిక్షణ ప్రతి బస్సుకి ఇద్దరు డ్రైవర్లు తప్పనిసరి నిర్ణయాన్ని కఠినతరం చేయాలని పేర్కొన్నారు. డ్రైవర్లకు నిరంతరం మెడికల్ టెస్ట్ నిర్వహించాలని సూచించారు. ప్రమాదాలు తగ్గించడానికి డ్రైవర్లకు నిరంతర శిక్షణ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా త్వరలోనే ఆర్టీసీ ఉద్యోగులతో జూమ్ సమావేశం నిర్వహిస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఇది విజయవంతం అయితే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బస్సుల్లో అమలు చేసేలా కార్యాచరణ తీసుకోవాలని ఆదేశించారు. తార్నాక హాస్పిటల్ లో రోగుల బంధువుల కోసం ఏర్పాటు చేస్తున్న డార్మిటరీ రూంను త్వరతిగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్టీసీ ఫంక్షన్ హాల్ లు వస్తున్న ఆదాయం ఖర్చులు వివరాలపై ఆరా తీశారు. దీని ద్వారా మరింత ఆదాయం పెంచుకోవాలని సూచించారు.

**మేడారంకు 3800 బస్సులు:**

ఆర్టీసీ మహిళా సంఘాల ద్వారా 600 బస్సులు అద్దె ప్రాతిపదికన నడిపించాలని సెర్ప్ తో ఒప్పందం చేసుకుంది. ఇప్పటివరకు 150 బస్సులు మహిళా సంఘాలు ఆర్టీసీతో సంయుక్తంగా నడుస్తున్నాయని మిగిలిన 450 బస్సులు కూడా మహిళా సంఘాల ద్వారా తీసుకోవాలని ఆదేశించారు. గత ఏడాది మేడారం జాతర కోసం 3490 బస్సులు నడపగా 16.83 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీలో ప్రయాణించారు. ఈసారి జాతర కు 20 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీలో ప్రయాణిస్తారని అంచనా వేస్తూ 3800 బస్సులు నడపడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. ఈ సమీక్షా సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఇతర ఆర్టీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు త్వరగా నిర్మిస్తే బిల్లులు వేగంగా మంజూరు..



**ముదిగొండ ,ఫ్లాష్ ఇండియా :** ప్రజలకు ఇచ్చిన మాట మేరకే ప్రభుత్వం పనిచేస్తోందని, ఈ ప్రభుత్వం ప్రజలకే అంకితం అయిందని, ప్రజలకే జవాబుదారీగా ఉంటుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యనించారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం ముదిగొండ మండలం గంధసిరి గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినా ఎలాంటి ఇబ్బంది లేకుండా సరఫరా చేసే వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. రైతులకు ఉచితంగా కరెంట్ ఇచ్చింది, 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు ఇస్తున్నది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన గుర్తుచేశారు.ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇళ్లు ఎంత త్వరగా నిర్మించుకుంటే, అంత వేగంగా బిల్లులు మంజూరు అవుతాయని భట్టి తెలిపారు. ప్రజల డబ్బు దోపిడీకి గురి కాకుండా ప్రతి పైసా ప్రజల అవసరాలకు ఖర్చు చేస్తున్నామని స్పష్టం చేశారు. 'ప్రజల సొమ్ము దోపిడికి గురైతే అది అత్యంత ప్రమాదకరం' అని హెచ్చరించారు. విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, మన బిడ్డల భవిష్యత్తు మన భవిష్యత్తు. వారి భవిష్యత్తు తీర్చిద్దేందుకు భారీగా నిధులు ఖర్చు చేస్తున్నాం.. అని అన్నారు. మహిళల ఆత్మగౌరవం కోసం వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని, ఐదు సంవత్సరాల్లో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చడం లక్ష్యమని చెప్పారు. మధిర నియోజకవర్గంలో 60 వేల మంది మహిళా సభ్యులతో ఉన్న ఇందిరా మహిళా డైరీ దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని భట్టి పేర్కొన్నారు.రెండు సంవత్సరాల్లో 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసినట్లు గుర్తుచేస్తూ, యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రతి నియోజకవర్గంలో జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎక్కడ ఉన్న ప్రజల సంక్షేమమే నా ధ్యేయం.. మధిర నియోజకవర్గ ప్రజలు వేసిన ప్రతి ఓటుకూ గౌరవం తీసుకువస్తాను.. అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు.

సంపాదకీయం

# తెలంగాణ ఐటీ.. ఉపాధిలో మేటి

రాష్ట్రం ప్రగతి పథాన ముందుకు సాగాలంటే ఉపా ధి కల్పన ఎంతో కీలకం. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవే ట్ రంగాల్లో అనేక ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ప్రాధాన్యత రోజురోజుకూ పెరుగుతు న్న నేపథ్యంలో ఉపాధి కల్పనలో ఐటీ రంగం కీలక పాత్ర పోషిస్తుంది. ఐటీ రంగంలోని అవకాశాలను ఒడిసి పట్టుకోవడంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది.ఐటీ కంపెనీల ఏర్పాటుకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించడం అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలను ఆకర్షిస్తూ తెలంగాణ విద్యార్థులకు సాంకేతిక రంగంలో ఉద్యోగాలు పొందేందుకు మార్గం సుగమం చేస్తుంది. దేశంలోనే అత్యధిక ఐటీ ఉద్యోగ అవకాశాలు సృష్టించిన రాష్ట్రాల జాబితాలో తెలంగాణ ముందువరుసలో ఉన్నది. తెలంగాణ ఐటీ రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు బలమైన ఆధారంగా నిలుస్తోంది.హైదరాబా దును కేంద్రంగా చేసుకుని వివిధ టెక్ కంపెనీలు, స్టార్టప్ లు వేగంగా విస్తరిస్తున్నాయి. దేశ ఐటీ వృద్ధిలో తెలంగాణ ప్రధాన పాత్ర పోషిస్తోంది. ప్రతీ నాలుగు కంపెనీలలో ఒకటి తెలంగాణలో ఉండటం రాష్ట్ర ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితుల కారణంగా ఆయా దేశాల్లో ఐటీ కంపెనీల నిర్వహణపై తీవ్ర ప్రభావం పడుతున్నది. ఈ క్రమంలో అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలన్నీ ప్రస్తుతం భారత్ వైపు చూస్తున్నాయి.ఇక్కడ తమ కంపెనీలను ఏర్పాటు చేసి కార్యకలాపాలను ప్రారం భించాలని ముందుకు వస్తున్నాయి. దీంతో దేశంలో ఐటీ రంగం గణనీయంగా వృద్ధి సా ధిస్తోంది. అయితే దేశంలో కంపెనీల ఏర్పాటుకు ముందుకు వస్తున్నా అంతర్జాతీయ కంపెనీలను ఆకర్షించడంలో తెలంగాణ రాష్ట్రం విజయం సాధిస్తోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 31 వేల ఐటీ కంపెనీలుండగా అందులో 7 వేల కంపెనీలు తెలంగాణలోనే ఉండటం విశేషం.ఈ జాబితాలో 10 వేల కంపెనీలతో కర్ణాటక రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉంది. తెలంగాణ రెండో స్థానం లో నిలువడం ద్వారా ఐటీ రంగం మరో మై లురాయిని అధిరోహించింది. దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం ఐటీ కంపెనీలలో 23 శాతం సంస్థలు తెలంగాణలోనే పనిచే స్తున్నాయి. హైదరాబాద్ నగరాన్ని కేంద్రంగా చేసుకుని దేశీయ, అంతర్జాతీయ కంపెనీలు వేగంగా విస్తరి స్తున్నాయి. గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, మెటా, ఒరాకిల్ వంటి బహుళజాతి దిగ్గజాల నుంచి స్థానిక స్టార్టప్ ల వరకు ఇక్క డ కార్యకలాపాలు కొనసాగి స్తున్నాయి. మొత్తం కంపెనీల్లో కేవలం 8 రాష్ట్రాల్లోనే 29 వేలకు పైగా ఐటీ కంపెనీలు ఉన్నాయి.

**అంతర్జాతీయ కంపెనీల ఆకర్షణ..**

దక్షిణ భారతదేశంలో అంతర్జాతీయ కం పెనీలకు ప్రధాన కేంద్రంగా హైదరాబాద్ మరింత అవత రిస్తోంది. గ్లోబల్ టెక్ దిగ్గజా లు గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఆపిల్, మెటా, ఒరాకిల్, డెలాయిట్ వంటి సంస్థలు తమ అత్యంత పెద్ద క్యాంపస్ లను హైదరాబాద్ లోనే ఏర్పాటు చేసుకోవడం రాష్ట్ర ప్రతిష్ఠను పెంచింది. గత రెండు సంవత్సరాల్లోనే 80కి పైగా విదేశీ కంపెనీలు హైదరాబాద్ లో కొత్త డెవలప్ మెంట్ సెంటర్లను ప్రారంభించాయి.ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయా లు, నైపుణ్యమున్న మానవ వనరులు, సులభమైన పాలసీలు ఇవన్నీ కలిసి నగరాన్ని గ్లోబల్ టెక్ హబ్ గా నిలబెట్టాయి. హైదరాబాద్ ప్రపంచంలో టాప్ ఐటీ డెస్టినేషన్లలో ఒకటిగా నిలిచింది. నానక్ రామ్ గూడ, గచ్చిబౌలి, కొండాపూర్, పోచారంలో కొత్త ఐటీపార్కులు రూపుది ద్దుకుంటున్నాయి.

**ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి..**

దేశంలో ఉపాధి సృష్టిలో తెలంగాణ ఐటీ రంగం అగ్రస్థానంలో నిలిచింది. ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూని కేషన్స్ శాఖ సమగ్ర నివేదిక ప్రకారం ప్రస్తుతం తెలంగాణలో ఐటీ రంగం ద్వారా 9 లక్షలకు పైగా ప్రత్యక్షంగా ఉపాధి లభిస్తున్నది. పరోక్షంగా మరో సుమారు 30 లక్షల మందికి జీవనోపాధిని అందిస్తున్నది. హైదరాబాద్ నగరానికి సమీపంలో ఏర్పాటు చేస్తున్న ఏఐ సిటీ, ఇన్నో వేషన్ హబ్ లు, టీ వీ టాస్క్ వంటి ప్రాజెక్టులు రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి వేదికలుగా మారుతున్నాయి. మహిళల ఉపాధి విషయంలోనూ తెలంగాణ ముందుంది. టాస్క్ ద్వారా శిక్షణ పొందిన యువతలో 42 శాతం మంది మహిళలే ఉన్నట్టు స్పష్టమవుతున్నది. ఐటీ అభివృద్ధిని కేవలం హైదరాబాద్ కే కాకుండా ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరిస్తున్నారు. వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ నగరాల్లోనూ ఐటీ కంపెనీలను విస్తరిస్తున్నారు.

# నలుగుతున్న ఫైళ్లు!


ఊరందరిదీ ఒక దారి అయితే.. ఉలిపిరి కట్టెది మరోదారి అన్న చందంగా మారింది మైనారిటీ సంక్షేమ శాఖది. అన్ని శాఖల్లో ఫైళ్లు చకచకా కదులుతుంటే.. మైనారిటీ సంక్షేమ శాఖలో మాత్రం.. అక్కడ నెలకొన్న విచిత్ర పరిస్థితి కారణంగా అధికారులు, వారితోపాటు ఫైళ్లుకూడా త్రిశంకు స్వర్గంలో తిరుగుతున్నాయి. ఇందుకు కారణం.. నలుగురు పైస్థాయి ప్రజాప్రతి నిధులు. కరవమంటే కప్పకు కోపం.. విడువుమంటే పాముకు కోపం సామెతలా ఒక్కో ఫైలు క్లియరెన్స్ విష యంలోగానీ, వివిధ పథకాల అమలులోగానీ నలుగురు ఉన్నత ప్రజాప్రతి నిధుల మధ్య అగమ్యగోచర పరిస్థితిని ఎదుర్కొంటున్నట్టు ఆ ఉద్యోగులు లబోదిబోమం టున్నారు.రాష్ట్రంలోని ముఖ్యమైన శాఖల్లో మైనారిటీ సంక్షేమ శాఖ ఒకటి. దీనికి మంత్రిగా తాజాగా.. మాజీ క్రికెటర్, కాంగ్రెస్ నేత మహమ్మద్ అజారుద్దీన్ బాధ్యతలు స్వీకరించారు. దీనితో పూర్తిస్థాయిలో తమ శాఖను చూసుకునేందుకు ఒక మంత్రి వచ్చారని మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది సంతోషించారు. అయితే ఆ సంతోషం ఎంతో కాలం నిలువలేదు. మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది పరిస్థితి మరింత దయనీయం అయ్యింది.ఎం దుకంటే.. ఈ శాఖపై అజమాయిషీ చేసేందుకు మంత్రి ఉండగా, మరోపక్క మైనారిటీ సంక్షేమాన్ని చూస్తున్న మాజీ మంత్రి ప్రస్తుత ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఉన్నారు. దీనికితోడు తాజాగా సీని యర్ కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని తీసుకొచ్చి.. సలహాదారుగా నియ మిస్తూ.. ముఖ్యమైన సంక్షేమం, అభివృ ద్ధి పథకాలపై అజామాయిషీ కల్పించా రు. ఇవన్నీ దాటుకుని వెళితే.. సీఎం కార్యాలయంలో ఉన్న మరో అనధికార నేత ఫైళ్ల విషయంలో ఎక్కువగా జోక్యం చేసు కుంటున్నారని సదరు శాఖ అధికారులు, సిబ్బంది తలప ట్టుకుంటున్నారు.మైనారిటీ సంక్షేమానికి సంబంధించి ఏదైనా ఫైలు, సంక్షేమ పథకానికి సంబంధించి తీసుకు వెళితే.. మంత్రి చెప్పింది విని.. ఆ విధంగా మార్పులు చేస్తున్నారు. అదే ఫైలును.. పరిశీలించిన మైనారిటీ సంక్షేమ సలహాదారు మరికొన్ని మార్పు ల సూచిస్తున్నారు. ఇక తాజాగా వచ్చిన ప్రభుత్వ సలహాదారు తనకున్న అనుభవంతో ఫ్లాగ్ షిప్ ప్రోగ్రాంలను అమలు చేసేందుకు తనవంతు మార్పులు, చేర్పులను చెబుతున్నారు.ఇదంతా చేసి.. ఫైలును సీఎం కార్యాలయానికి తీసుకెళితే.. సీఎంకు షాడోలా ఉండే సదరు నేత కీలకమైన సూచనలు అందిస్తుండటంతో.. ఈ నలుగురిని సమన్వయం ఎలా చేయాలో.. అసలు ఫైళ్లు క్లియర్ చేయడం చేతకాక తలలు బాదుకుం టున్నారు. నలుగురి మధ్యన నలిగి పోతున్నామని చర్చిం చుకుంటున్నారు. కొన్నిసార్లు.. ఈ నలుగురి వద్దకు మీరు వెళ్ళమంటే.. మీరు వెళ్ళండంటూ అధికారులు, వెనుకంజ వేస్తున్నారంటే మైనారిటీ సంక్షేమ శాఖలో నెలకొన్ని విచిత్ర పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.వాస్త వానికి ఏదైనా అంశం చర్చకు వస్తే.. నలుగురు కలిసి చర్చించుకుని అంతమంగా ఏం చేయాలనేది చెబితే సరిపోతుంది. కానీ.. ఒకరికి కుదిరితే మరొకరికి కుదరడం లేదు. అధికారులు, సిబ్బంది ఆయన వద్దకే వెళతారా.. మా వద్దకు రారా అనే భేషజాలు ఉండనే ఉన్నాయి. దీనితో ఒక్కొక్కరి వద్దకు వెళ్ళి ఫైలు గురించి వివరించి.. వారి సలహా లు, సూచనలు, ఆదేశాల ప్రకారం మార్పులు, చేర్పులు చేయాల్సి వస్తోంది.ఇంతా చేసి సీఎం కార్యాలయానికి ఫైలు తీసుకెళితే.. అక్కడ అనధికారిక జోక్యం ఎక్కువవుతోందని అధికారులు నీర సించిపోతున్నట్టు శాఖలో ఉద్యోగులు చర్చించుకుం టున్నారు. అక్కడి నుంచి వచ్చే సలహాలు, సూచనల మేరకు ముం దు వెళ్దామంటే.. మళ్ళీ తిరిగి మొదటి నుంచి తిరగాల్సి వస్తోందని సిబ్బంది బెంబేలెత్తు తున్నారు. ఈ సమస్యకు పరిష్కారం కనుక్కొని.. తమను ఒక ఒడ్డున పడేయాలని మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది వేడుకుంటున్నా రు. లేకపోతే ఆ నల్గురి మధ్యన నలిగిపోక తప్పదనే భయం వారిని వెంటా డుతోంది.

# సీఎం వద్దకు చేరిన పంచాయితీ

రాష్ట్ర మంత్రులు, ఆయా శాఖల సెక్రెటరీలకు పొసగడం లేదు. మంత్రి ఒకటి చెప్తే.. సెక్రెటరీలు మరొకటి చేస్తున్నారు. తాము చెప్పిన పని ఎందుకు చేయలేదని మినిస్టర్లు ప్రశ్నిస్తే.. రూల్స్ కు విరుద్ధంగా ఉన్నందున నిర్ణయాలు తీసుకోలేమని తెగేసి చెబుతున్నారు. అన్ని విషయాల్లో అదే తీరుగా ఉండటం లేదని, తమకు ఇష్టమైన వారి ఫైల్స్ విషయంలో మాత్రం రూల్స్ పక్కన పెట్టిన ఆఫీసర్లు వాటిని వెంటనే క్లియర్ చేస్తున్నట్లు విమర్శ లున్నాయి. దీంతో ఇరువురి మధ్య విబేధాలు తలెత్తి చివరికి సెక్రెటరీలనే మార్చాలని మంత్రులు నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిసింది.చాలా మంది వివిధ సమస్యలపై మంత్రులకు వినతి పత్రాలు ఇస్తూ ఉంటారు. వాటిని పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని మినిస్టర్లు తమ శాఖ సెక్రెటరీలకు రికమెండ్ చేస్తుంటారు. కొన్ని ముఖ్యమైన విజ్ఞప్తులు ఉంటే స్వయంగా ఫోన్ చేసి మాట్లాడటమో లేక తమ చాంబర్ కు పిలిచి చెప్పడమో చేస్తుంటారు. మంత్రులు చెప్పినప్పుడు సరే అంటూ తల ఊపుతున్న సెక్రెటరీలు తర్వాత సంబంధిత ప్రపోజల్ పై నెగిటివ్ గా రాయడమో లేక కొర్రీలు పెట్టడమో వంటివి చేస్తున్నారనే విమర్శలున్నాయి. ఒక వేళ రూల్స్ కు విరుద్ధంగా ప్రపోజల్స్ ఉంటే సమయం, సందర్భం చూసుకుని మంత్రులకు వివరించాల్సి ఉంటుంది. కానీ మెజార్టీ సెక్రెటరీలు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి.మంత్రులు, సెక్రెటరీల మధ్య విభేదాలు, మనస్పర్థాలు రావడానికి ఇరువురు మధ్య సమన్వయం లేక పోవడమే కారణమని తెలుస్తున్నది. మంత్రి ఓ రకంగా ఆలోచిస్తుంటే, సెక్రెటరీలు మరో రకంగా వ్యవహరించడం వల్ల సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ఐఏఎస్ లు విధాన పరమైన అంశాల్లో ఏ విధంగా నిర్ణయాలు తీసుకోవాలి? బాధితులకు ఏ రకంగా న్యాయం చేయొచ్చు? అనే అంశాలపై మంత్రులకు రూల్స్ వివరించాలి. మంత్రులు సైతం ఐఏఎస్ లు ఇచ్చే సలహాలు పాటించాలి. ఒక వేళ సదరు అధికారి తప్పుగా గైడ్ చేస్తున్నారని డౌట్ వస్తే తమకు సన్నిహితంగా ఉండే అధికారుల ఒపీనియన్ తీసుకోవాలి. అప్పుడే ఇరువురు మధ్య సహకారం, సమన్వయం ఉంటుంది.ఈ మధ్య ఐఏఎస్ అధికారి రిజ్వీ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మధ్య జరిగిన ఎపిసోడ్ పెద్ద సంచలంగా మారింది. తనకు తెలీకుండానే శాఖ సెక్రెటరీ పలు నిర్ణయాలు తీసుకున్నారని, దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడిందని మంత్రి స్వయంగా చీఫ్ సెక్రెటరీ రామకృ ష్ణారావుకు ఫిర్యాదు చేశారు. రూల్స్ కు విరుద్ధంగా వ్యవ హరించిన రిజ్వీ స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు అనుమతి ఇవ్వొద్దని లేఖలో పేర్కొన్నారు. కానీ అప్పటికే ప్రభుత్వం ఆయన అప్లై చేసిన వీఆర్ఎస్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే ఆ సమయంలోనే చాలా మంది మంత్రులు, తమ శాఖల సెక్రెటరీల పనితీరుపై సన్నిహితుల వద్ద ప్రస్తావిస్తూ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఐఏఎస్ లు రూల్స్ పేరుతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన చెందుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది.మెజార్టీ మంత్రులు తమ వద్ద పని చేస్తున్న ఐఏఎస్ లను మార్చి కొత్త వారిని అపాయింట్ చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి అప్పీల్ చేస్తున్నట్లు తెలుస్తున్నది. కొందరు సీనియర్ మంత్రులు నేరుగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు మొహమాటం అడ్డురావడంతో సీఎస్ కు, సీఎంవో సెక్రెటరీకి చెబుతున్నట్టు సమాచారం. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో ఐఏఎస్ ల కొరత ఉంది. అందులో పాలన అనుభవం ఉన్న ఆఫీసర్లు కొందరే ఉన్నారు. ఇందులో ఎవరిని మార్చాలి? ఎవరిని కొనసాగించాలి? అనే అంశంపై కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. అయితే కొందరు స్పెషల్ సీఎస్, ప్రిన్సిపల్ సెక్రెటరీల విషయంలో కాంగ్రెస్ లీడర్లకు అభ్యంతరాలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో సన్నిహితంగా ఉన్నారనే విమర్శలున్నాయి. అందుకే అనుభవం ఉన్న ఐఏఎస్ లను పక్కన పెట్టారని టాక్ ఉంది.ఉత్తర తెలంగాణకు చెందిన ఓ సీనియర్ మంత్రికి ఆ శాఖ సెక్రెటరీకి మధ్య పొసగడం లేదు. మంత్రి పంపిన ప్రపోజల్ ను వెంటనే క్లియర్ చేయడం లేదు. ఫోన్ చేసి అడిగితే ఇదిగో.. అదిగో అంటూ రోజులు గడుపు తున్నారు. దీంతో ఆ సెక్రెటరీని ట్రాన్స్ ఫర్ చేస్తే బాగుండు అని ఆ మంత్రి తన సన్నిహితుల వద్ద కామెంట్ చేస్తున్నారు.ఓ మంత్రికి మూడు తరాల సీఎంలతో పని చేసిన అనుభవం ఉంది. పాలనావిషయాల్లోనూ ఆయనకు మంచి పట్టుంది. అలాంటి మంత్రి తన శాఖ సెక్రెటరీలు నెగిటివ్ గా వ్యవహరించడం జీర్ణించుకోలేకపోతున్నారు. ఆయన ముందు సరే అంటూ తలూపే అధికారులు తర్వాత ఫైల్స్ క్లియరెన్స్ పై కొర్రీలు పెడుతున్నారు. దీంతో ఆ మంత్రి తనదైన శైలీలో వ్యవహరించడం పరిపాటిగా మారిందని, గతంలో ఓ ఐఏఎస్ ఆయన ధాటికి తట్టుకోలేక అక్కడి నుంచి మరో చోటకు ట్రాన్స్ ఫర్ అయినట్లు ప్రచారంలో ఉంది.ప్రతి శాఖలో మంత్రి నిర్ణయమే ఫైనల్. కానీ ఓ శాఖ సెక్రెటరీ మాత్రం మినిస్టర్ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఫైల్స్ పై నెగిటివ్ రాసి చీఫ్ సెక్రెటరీ ఆమోదం కోసం పంపారు. అలాగే ఆ శాఖ హెచ్ఓడీ సైతం మంత్రి పంపిన 100 డిప్యూటేషన్ల రికమెం డేషన్లను పక్కన పెట్టారు. కానీ తనకు కావాల్సిన వ్యక్తులకు మాత్రం సదరు సెక్రెటరీ డిప్యూటేషన్లకు అనుమతివ్వడం హాట్ టాపిక్ గా మారింది.ఉమ్మడి రాష్ట్రంలో సీనియర్ గా పని చేసిన అనుభవం, హైకమాండ్ వద్ద పలుకుబడి ఉన్న ఓ మంత్రి పంపే ఫైల్స్ ను ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ చూడటం లేదనే విమర్శలున్నాయి. దీంతో ఆ బాధ్యతలను ఓ జూనియర్ ఐఏఎస్ కు అప్పగించారు. ఆయన ఇదే అదునుగా భావించి శాఖలోని అధికారుల ప్రమోషన్ల టైంలో పెద్ద ఎత్తున దండుకున్నట్లు టాక్ ఉంది.మం త్రులతో రివ్యూలు ఉంటే సెక్రెటరీలు ఓ గంటో లేక అరగంటో ముందుగా వచ్చి సంబంధిత సబ్జెక్ట్ పై ఇతర అధికారులతో ప్రిపేర్ అవుతుంటారు. కానీ ఓ సెక్రెటరీ మాత్రం మంత్రి ఇంటి నుంచి స్టార్ట్ అయ్యారా? లేదా? అనేది తెలుసుకుని ఆ తర్వాతే తాను ఇంటి నుంచి సెక్రెటే రియట్ కు బయలు దేరుతారని విమర్శ ఉంది. కొన్ని సార్లు మంత్రి వచ్చిన తర్వాత ఆయన వస్తుంటారని ప్రచారంలో ఉంది.ఈ మధ్య జరిగిన బదిలీల్లో ఓ ఐఏఎస్ కీలకమైన శాఖ నుంచి మరో శాఖకు బదిలీ అయ్యారు. ఆ సమయంలో మంత్రి జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బిజీగా ఉన్నారు. ఇంటికెళ్లి మర్యాద పూర్వకంగా కలిసే అవకాశం ఉంది. కానీ ఆ ఆఫీసర్ ఇప్పటి వరకూ సంబంధిత మంత్రిని కలవలేదు. సెక్రెటేరియట్ లో మాత్రమే కలుస్తానని అన్నట్లు తెలిసింది.మున్సిపల్ శాఖలోని ఓ అధికారి తీరుపై చాలా మంది ఎమ్మెల్యేలు.. ముఖ్యమంత్రికు ఫిర్యాదు చేశారు. తాము ఎన్నిసార్లు ఫోన్ చేసినా కనీసం లిఫ్ట్ చేయడం లేదని, సదరు ఆఫీసర్ ను అక్కడి నుంచి బదిలీ చేయాలని కోరినట్లు సమాచారం.

# రూటు మార్చిన 'సైబర్' కేటుగాళ్లు..

రోజురోజుకూ సైబర్ మోసాలు పెరిగిపోతున్నాయి. ఒకటి కాదు.. రెండు కాదు.. వందల సంఖ్యలో బాధితులు సైబర్ క్రైమ్ కు గురై ఏదో ఒక రూపంలో తమ డబ్బులు పోగొట్టు కుంటున్నారు. వెలుగులోకి వచ్చిన ఘటనలు కొన్నైతే.. వెలుగులోకి రాని ఇన్సిడెంట్లు అనేకంగా ఉన్నాయి. అయితే ఆర్థిక మోసాలకు వేదికగా మారుతున్న సోషల్ మీడియాలో ఫేక్ అంశాలను కట్టడి చేయడంలో నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్ సీసీఆర్ పీ) విఫలమ వుతుందనే చెప్పాలి. జియో ఫెన్సింగ్ విధానం ద్వారా ఆన్ లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్ లను నియంత్రించినా ఫేక్ వీడియోలను సర్క్యులేట్ చేయకుండా కట్టడి చేయలే కపోతున్నట్టు రాష్ట్ర స్థాయి సైబర్ వింగ్స్ చెబుతున్నాయి. ఎన్ సీసీఆర్ పీ మాత్రమే ఆ దిశగా చర్యలు చేపట్టాలని సూచిస్తున్నాయి.'రూ.21 వేలు పెట్టుబడి పెట్టండి.. నెల రోజుల్లో రూ.20 లక్షలు పొందండి. ఈ స్కీమ్ లో నేను సైతం చేరాను' అంటూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పినట్లు ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనిపై కేంద్ర మంత్రి సీతారామన్ అక్టోబర్ 7న ముంబైలో జరిగిన గ్లోబల్ ఫిన్ టెక్ ఫెస్ట్ లో స్పందించారు. ఏఐతో గొంతులు అనుకరించి, క్లోన్ ఐడెంటిటీతో వీడియోలు తయారు చేసి మోసం చేస్తున్నారని వెల్లడించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో రెండు నెలలుగా సర్క్యులేట్ అవుతున్నా దానికి బ్లాక్ చేయడంలో ఎన్ సీసీఆర్ పీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు.'రూ.22 వేలతో ఇన్వెస్ట్ మెంట్ ప్రారంభించండి రూ.25 లక్షలు మీ సొంతం చేసుకోండి' అంటూ గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ చెప్పినట్లు సోషల్ మీడియాలో ఓ వీడియో చక్కర్లు కొడుతోంది. ఏఐ ద్వారా వీడియో తయారు చేసిన సైబర్ ఫ్రాడ్స్ దానిని సోషల్ మీడియాలో ఫార్వర్డ్ చేస్తున్నట్లు సైబర్ నిపుణులు తెలుపుతున్నారు. కానీ వీడియోను సోషల్ మీడియా వేదికను నుంచి తొలగించలేదు. ఇవే కాకుండా డీప్ ఫేక్ వీడియో.. ఏఐ సాయంతో ప్రముఖ వ్యక్తులు, రాజకీయ నాయకులు, కేంద్ర మంత్రులు, సెలబ్రిటీలు చెప్పినట్లు వీడియోలు తయారు చేసి వాటిని అమాయకులకు పంపించి మోసం చేసిన ఘటనలు అనేకంగా ఉన్నాయి.పలువురు ఐఏఎస్, ఐపీఎస్ ల పేరుతో ఇటీవల కొందరు సైబర్ ఫ్రాడ్స్ ఫేక్ ఐడీలు తయారు చేశారు. వాటితో వాట్సాప్, ఫేస్ బుక్ , మేసేంజర్ నుంచి పలువురికి మెసేజ్ లు చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. డబ్బులు అవసరం ఉన్నాయి.. పంపండి అని, తక్కువ ధరకు ఫర్నీచర్ అమ్మకానికి ఉందంటూ మెసేజ్ లు చేస్తూ బాధితుల నుంచి అందినకాడికి దోచుకుంటున్నారు. తెలంగాణకు చెందిన ఐఏఎస్ అధికారి నవీన్ మిట్టల్ పేరుతో పదుల సంఖ్యలో ఫేస్ బుక్ అకౌంట్స్ తయారు చేసినట్టు తెలుస్తుంది. ఆయన పేరుతో సందేశాలు రావడంతో డబ్బులు పంపి మోసపోయిన వారు సైబర్ క్రైమ్ లో ఫిర్యాదు చేసిన ఘటనలు ఉన్నాయి.సైబర్ మోసాలు జరుగుతున్నా, సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదులు అందుతున్నా నియంత్రణా చర్యలు చేపట్టడంలో సంబంధిత అధికారులు విఫలమవుతున్నట్టు ఆరోపణ లున్నాయి. సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ అయిన ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్, ఎక్స్ వంటి వాటిని సంప్రదించి కట్టడి చేయాల్సిన అవసరం ఉందని సైబర్ క్రైమ్ బాధితులు తెలుపుతున్నారు. డిజిటల్ అరెస్టు మోసాలపై సుప్రీంకోర్టు స్పందించాలని బాధితులు కోరుతున్నారు.ఆర్థిక పరమైన నష్టాల నుంచి సామాన్యులను కాపాడేందుకు స్టాక్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ), నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ పీసీఐ) వంటి నియంత్రణ సంస్థలు కీలక నిర్ణయాలు తీసుకున్నాయి. పెట్టుబడిదా రులను సంప్రదించే సంస్థల యూపీఐ హ్యాండిల్స్ విషయంలో సరైన నిబంధనలు పాటించాలని స్పష్టం చేశాయి. ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (మెయిటీ) ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) నియమాలు-2021కి సవ రణలను విడుదల చేసింది. డిజిటల్ మీడియా అకౌంట్ కోసం ఒకరి వ్యక్తిగత సమాచారంపై మరో వ్యక్తికి ఎలాంటి హక్కూ ఉండదని పేర్కొంది. వీటిని ఉల్లంఘిస్తూ ఎవరైనా వ్యక్తిగత సమాచార గోప్యతకు భంగం కలిగించడానికి వీల్లేదని పేర్కొంది. పేటెంట్, ట్రేడ్ మార్క్, కాపీరైట్ వంటి యాజమాన్య హక్కులను ఉల్లంఘించేందుకు డిజిటల్ మీడియాను వాడుకుంటే ఐటీ యాక్ట్ పరిధిలో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించింది.వాట్సాప్, ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్, యూట్యూబ్ లాంటి సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ లలో ఏఐతో రూపొందించిన వీడియోలు, ఫొటోలపై స్పష్టమైన లేబుల్ ఉండాలని కొత్త డ్రాఫ్ట్ రూల్స్ లో ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ లేబుల్ స్క్రీన్ లో కనీసం 10% స్పేస్ ను కవర్ చేయాలని సూచించింది. కంటెంట్ వీడియో ఏఐతో రూపొందిం చినట్టు చూపించాలని, లేబుల్ తొలగించేందుకు వీలు లేకుండా ఉండాలని తెలిపింది. యూజర్లు ఫేక్ కంటెంట్ అప్ లోడ్ చేస్తే అది ఏఐతో రూపొందించినట్టు స్పష్టంగా పేర్కొనాలని తెలిపింది. సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ ఆటోమేటెడ్ టూల్స్ ద్వారా ఫేక్ కంటెంట్ అరికట్టాలని పేర్కొంది. ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టినా ఆర్థిక మోసాల కట్టడికి కళ్లెం పడటం లేదని సైబర్ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కఠిన చర్యల ద్వారానే నియంత్రణలో వస్తాయని తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.పెట్టుబడులపై సోషల్ మీడియాలో ప్రసారం అవుతున్న ఫేక్ వీడియోలను నమ్మొద్దు. పెట్టుబడులు పెట్టండి అంటూ వాట్సాప్ ఇతర ప్లాట్ ఫామ్స్ లో వచ్చే మెసేజ్ లతో అప్రమత్తంగా ఉండాలి. ఇటీవల కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ వంటి ప్రముఖుల పేరుతో ఫేక్ వీడియోలు ప్రసారం అవుతున్నాయి. అలాంటి వాటిని నమ్మి పెట్టుబడులు పెట్టొద్దు. సోషల్ మీడియా ద్వారా తెలియని వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్ లతో అప్రమత్తంగా ఉండాలి. ఆన్ లైన్ చెల్లింపులు చేసే అంశంలోనూ జాగ్రత్తగా ఉండాలి. - సాయి శ్రీ, డీసీపీ సైబర్ క్రైమ్, సైబరాబాద్ కమిషనరేట్



సంపాదకీయం పేజీలో రచనలు పంపవలసిన వాట్సప్ నంబర్ ,మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

## టీడబ్ల్యూజేఎఫ్ నుంచి పలువురి బహిష్కరణ

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షులు బండి విజయ్ కుమార్, వల్లాల జగన్, రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా కార్యదర్శి కుడితూడి బాపూరావును సంఘం నుంచి రాష్ట్ర కార్యవర్గం బహిష్కరించిందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య తెలిపారు. కొంతకాలంగా వీరంతా సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని.. సంఘం నియమ, నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ ఏకపక్ష నిర్ణయాలతో ఐక్యతకు భంగం కలిగిస్తున్నారని కార్యవర్గం పేర్కొన్నారు. కుల, మత, వర్గ ప్రస్తావనలు తెస్తూ సంఘంలో అనైక్యతకు కారణమవుతున్నారని తెలిపారు.అదేవిధంగా సంఘం పేరిట అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని.. సంఘం సభ్యత్వ రుసుంను దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు. సంఘం వాట్సాప్, ఇతర సోషల్ మీడియా గ్రూపుల్లో సంఘం విభజనకు దారితీసేలా పోస్టులు పెడుతున్నారని.. గ్రూపులు, ముఠాలను ప్రోత్సహిస్తున్నారని.. పద్ధతి మార్చుకోవాలని అనేక పర్యాయాలు సూచించినా వారిలో ఎలాంటి మార్పు రాలేదని తెలిపారు. సంజాయిషీ కోరుతూ రాష్ట్ర కార్యవర్గం తరపున ప్రధాన కార్యదర్శి మూడుసార్లు నోటీసులు పంపినా అధ్యక్షుడు మామిడి సోమయ్యతోపాటు ఇతరులు బేఖాతరు చేశారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం హైదరాబాద్ లో నిర్వహించిన రాష్ట్ర అత్యవసర కార్యవర్గ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించి వారిని శాశ్వతంగా బహిష్కరించాలని తీర్మానించినట్లు పేర్కొన్నారు. వీరి ప్రాథమిక సభ్యత్వాన్ని సైతం రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇక నుంచి వీరు నిర్వహించే సమావేశాలు, ఇతర కార్యక్రమాలకు టీడబ్ల్యూజేఎఫ్ కు సంబంధం లేదని.. ఈ విషయాన్ని జర్నలిస్టు గమనించాలని కోరారు. అలాగే.. రాష్ట్ర మహాసభల నిర్వహణ కార్యక్రమాల కోసం అడహాక్ కమిటీ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర కార్యవర్గ సమావేశం తీర్మానం చేసింది.

## దేశ వ్యతిరేక శక్తుల కుతంత్రమే


**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** దేశ రాజధాని ఢిల్లీ నగరంలో సోమవారం సాయంత్రం భారీ పేలుడు చోటు చేసుకొని 13 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో యావత్ దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. వెంటనే విచారణ ప్రారంభించిన పోలీసులు ఉగ్రవాదుల ఆత్మాహుతి దాడిగా నిర్ధారించారు. అలాగే ఈ కేసును ఎన్ఐఏ కు అప్పగింగచా వేగంగా విచారణ కొనసాగుతోంది. అయితే ఈ షాకింగ్ ఘటనపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు స్పందిస్తూ.. ఢిల్లీలో జరిగిన ఉగ్రవాద పేలుడు ఘటన దేశ వ్యతిరేక శక్తుల కుతంత్రమేనని తీవ్ర స్థాయిలో మండి పడ్డారు. అలాగే ఈ దాడి దేశంలో శాంతిని భంగం చేసేందుకు, భారత ప్రగతిని అడ్డుకునేందుకు ఉద్దేశపూర్వకంగా చేసిన చర్య అని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం ఈ ఘటనను ఉగ్రవాద చర్యగా నిర్ధారించిందని ఆయన తెలిపారు.పాకిస్తాన్, జిహాదీ మద్దతుదారులు ఈ దాడికి కారణమని ఆరోపిస్తూ, దేశ భద్రతను దెబ్బతీయాలనే శక్తుల ప్రయత్నమే ఇది అని రాంచందర్ రావు అన్నారు. జాతీయా మీడియా సంస్థతలో ఆయన మాట్లాడుతూ.. ఈ ఘటనను వెలుగులోకి తీసుకువచ్చిన దర్యాప్తు సంస్థల పనితీరు ప్రశంసనీయమని అభిప్రాయపడ్డారు. వారు అసలు కుట్రను బహిర్గతం చేసి ప్రజలకు కీలకమైన వివరాలు తెలియజేశారని అన్నారు. ఇది దేశ దర్యాప్తు సంస్థల ఉత్తమ పరిశోధనల్లో ఒకటని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రజలు కూడా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేసే సమయంలో జాగ్రత్తగా, సానుకూల దృక్కోణంతో వ్యవహరించాలి అని సూచించారు. దేశం మొత్తం ఇలాంటి ఉగ్రవాద చర్యలను అరికట్టేందుకు భారత ప్రభుత్వానికి అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఢిల్లీ ఫస్ట్.. హైదరాబాద్ సెకండ్..!

### పొల్యూషన్ దెబ్బతో భారీగా పెరిగిన ఇన్సూరెన్స్ క్లెయిమ్స్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** చలికాలం వచ్చిందంటే దేశరాజధాని ఢిల్లీలో గాలి నాణ్యత తగ్గటం.. అక్కడి ప్రజలు బయటకు రావటం కూడా కష్టతరంగా మారటం గడచిన కొన్నేళ్లుగా సర్వ సాధారణంగా మారిపోయింది. అయితే ఈ పరిస్థితుల వల్ల ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది చిన్న పిల్లలు, వృద్ధులని తెలుస్తోంది. అయితే ఈ సమస్య ప్రస్తుతం ఢిల్లీతో పాటు దేశంలోని మరిన్ని మెట్రో నగరాలకు కూడా పెద్ద విపత్తుగా మారిందని డేటా చెబుతోంది. తాజా పాలసీ బజార్ డేటా ప్రకారం వాయు కాలుష్యం కారణంగా అనారోగ్యానికి గురవుతూ ఇన్సూరెన్స్ క్లెయిమ్స్ ఢిల్లీలో పెరిగిపోయాయి. ఇది మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారంగా నిలిచిందని వెల్లడైంది. 2022-25 మధ్య కాలంలో దేశంలోని ఐదు ప్రధాన నగరాల్లో పొల్యూషన్ వల్ల అనారోగ్య క్లెయిమ్స్ 4 లక్షలుగా ఉన్నట్లు తేలింది. మొత్తం క్లెయిమ్స్ లో 43 శాతం 10 ఏళ్ల లోపు పిల్లలకు సంబంధించినవిగా వెల్లడైంది. ఇక 30-40 ఏళ్ల మధ్య వయస్కుల క్లెయిమ్స్ 14 శాతం, 60 ఏళ్లు పైబడిన వారి క్లెయిమ్స్ 7 శాతంగా ఉన్నట్లు తేలింది. పొల్యూషన్ కారణంగా అనారోగ్యంతో ఇన్సూరెన్స్ క్లెయిమ్స్ విషయంలో మొదటి స్థానంలో ఢిల్లీ ఉండగా.. రెండవ స్థానంలో హైదరాబాద్ నగరం నిలవటం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. నగరం విస్తరణతో పాటే సమస్యలూ పెరుగుతున్నాయని.. ఇది గాలి నాణ్యతను కూడా తగ్గిస్తోందని చాలా మంది అంటున్నారు. ఇక ఎయిర్ పొల్యూషన్ వల్ల ఇబ్బంది పడుతున్న నగరాల జాబితాలో బెంగళూరు మూడో స్థానాన్ని దక్కించుకుంది. తర్వాతి స్థానాల్లో పూణే, ముంబై నిలిచాయి.రోజురోజుకూ పెరుగుతున్న ఎయిర్ పొల్యూషన్ కారణంగా ఈ నగరాల్లో ఇన్సూరెన్స్ క్లెయిమ్స్ ఎక్కువగా శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో పాటు ఆస్తమా, క్రానిక్ అబ్స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్, అరిథ్మియా, హైపర్ టెన్షన్, ఎగ్జిమా, కండ్లకలక, గర్భధారణ సమస్యలు, అలెర్జీలు,సైనసిటిస్ లకు సంబంధించినవిగా వెల్లడైంది. సగటు క్లెయిమ్ మొత్తం రూ.55వేల కంటే ఎక్కువగా ఉండగా.. రోజుకు సగటు హాస్పిటల్ బిల్స్ రూ.19వేల వద్ద ఉన్నట్లు తేలింది. ఎయిర్ పొల్యూషన్ సమస్యలకు ఎక్కువ కాలం ఆసుపత్రిలో ఉండాల్సి రావటం వారికి ఆక్సిజన్ థెరపీ, నెబ్యులైజేషన్ వంటి చికిత్సలు అవసరం కావటం వల్ల ఈ వ్యాధులకు వైద్యం కొంత ఖరీదుగా మారినట్లు నిపుణులు చెబుతున్నారు.

## భాగ్యనగరంలో హై అలర్ట్..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** భాగ్యనగరంలో హైఅలర్ట్ కొనసాగుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన బాంబు పేలుళ్ల నేపథ్యంలో మెట్రో నగరాల్లో హై అలర్ట్ కొనసాగుతోంది. బస్టాండ్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు , శంషాబాద్ ఎయిర్ పోర్టులలో విస్తృత తనిఖీలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో రైల్వే పోలీసులు తనిఖీలు చేపట్టారు. రైల్వే స్టేషన్ లో బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ తో అధికారులు తనిఖీలు నిర్వహించారు. మతపరమైన ప్రాంతాలు, పర్యాటక ప్రాంతాలు, షాపింగ్ మాల్స్ లోనూ సోదాలు జరుగుతున్నాయి. అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సిటీ పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. హోటల్స్ పై పోలీసులు నిఘా పెంచారు.ఇక.. దేశంలో ఎక్కడ, ఏ ప్రాంతంలో పేలుళ్లు జరిగినా వాటి మూలాలు హైదరాబాద్‌లో ఉండటం తీవ్ర కలకలం రేపుతున్న విషయం. ఎన్ఐఏ, వివిధ రాష్ట్రాలకు చెందిన పోలీసులు రాష్ట్రంలో తనిఖీలు చేయగా.. అనుమానిత వ్యక్తులు పట్టుబడటం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల రాజేంద్ర నగర్‌లో ఉగ్రవాద ఆరోపణలతో డాక్టర్ అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్‌ను గుజరాత్ ఏటీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. గత అర్ధరాత్రి సయ్యద్ ఇంట్లో సోదాలు జరిపిన గుజరాత్ పోలీసులు.. పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.కాగా... రెండు రోజుల క్రితం ఢిల్లీలో భారీ పేలుడు ఘటన దేశాన్ని ఉలిక్కి పడేలా చేసింది. ఎర్రకోట మెట్రోస్టేషన్ సిగ్నల్ వద్ద నిలిచిన ఓ కారులో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోగా.. అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. ఢిల్లీ బ్లాస్ట్‌తో దేశవ్యాప్తంగా మెట్రో నగరాల్లో హైఅలర్ట్ కొనసాగుతోంది.

# అమ్మో.. పీఆర్సీనా!

## ఉలిక్కి పడుతున్న సర్కారు

- కమిటీ నివేదిక ఎప్పుడో సిద్ధం
- ఆర్థిక భారం మోయలేకనే అమలు చేయడం లేదంటున్న ఉద్యోగులు
- 2023 జూలై 1 నుంచే అమలు కావాల్సి ఉన్న నూతన పీఆర్సీ
- 51 శాతం ఫిట్‌మెంట్ అడుగుతున్న ఉద్యోగ సంఘాలు
- కనీసం 1 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలన్నా రూ. 250-300 కోట్లు సర్కారుపై భారం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఉద్యోగులకు అమలు చేయాల్సిన ఆర్థిక పరమైన అంశాల గురించి లేవనెత్తితే చాలు ప్రభుత్వం ఉలిక్కి పడుతోంది. ఏవీ అడగొద్దు.. బడ్జెట్ లేదు అని ఉద్యోగ సంఘాల నేతలతో ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారని తెలిసింది. తెలంగాణ తొలి పీఆర్సీ గడు వు 2023 జూన్ 30తో ముగిసిపోయింది. కొత్త పీఆర్సీని 2023 జూలై 1 నుంచి రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయాల్సి ఉంది. కానీ ఇంతవరకు ప్రభుత్వం దాని ఊసేత్తడంలేదు.గడువు ముగిసినా ఉలుకు పలుకు లేదు. పీఆర్సీ గురించి మాట ఎత్తవద్దనే విధంగా ప్రభుత్వం తీరు ఉందని ఉద్యోగ సంఘాల నేతలు చెబుతున్నారు. పీఆర్సీ అమలు చేస్తే ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతుంది. అసలే రాష్ట్ర రాబడి అంతంత మాత్రంగా ఉంది. వచ్చే ఆదాయం సంక్షేమ పథకాలు, ఉద్యోగులు జీతాలకే సరిపోతోంది.దీనికి తోడు కేంద్రం జీఎస్టీ స్లాబులను కూడా సవరించడంతో రాష్ట్రానికి ఆదాయం ఆశించిన స్థాయిలో రావడంలేదు. ఈక్రమంలో పీఆర్సీని అమలుచేయాలంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని కావడంతో ప్రభుత్వం అందుకే పీఆర్సీ జోలికి ప్రస్తుతం పోవడంలేదని తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు వేతన సవరణను ఎప్పటికప్పుడు కమిషన్ ను నియమించడం, నివేదికను తెప్పించుకోవడం, దాన్ని అమలు చేయడం జరుగుతోంది. కానీ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రం అది టైం ప్రకారం అమలు కావడంలేదు. రాష్ట్ర ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు 2023 జూలై 1 నుంచి అమలు కావాల్సిన పీఆర్సీ అమలుకు నోచుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ ఎస్ ప్రభుత్వం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎన్.శివశంకర్ చైర్మన్ గా, రిటైర్డ్ ఐఏఎస్ బీ.రామయ్య సభ్యుడిగా రెండో పీఆర్సీ కమిటీని అప్పట్లో నియమించింది.ఈ కమిటీ ఆరు నెలల్లో ప్రభుత్వానికి నివేదికను సమర్పించాల్సి ఉంది. 2024 ఏప్రిల్ 2వ తేదీతో ఆ కమిటీ గడువు ముగిసింది. అయితే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల కారణంగా కమిటీ గడువును ఆరునెలలు పొడిగించారు. ఈ అక్టోబర్ 2వ తేదీకి పీఆర్సీ కమిటీని నియమించి రెండేండ్లు పూర్తయ్యింది. నవంబర్ నెల కూడా గడిచిపోతోంది. ప్రభుత్వానికి నివేదిక సమర్పిం చేందుకు రాష్ట్రంలోని అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల నుంచి ఈ పీఆర్సీ కమిటీ పలు దఫాలుగా సమావేశమై ప్రతిపాదనలు సైతం స్వీకరించింది.ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు 51 శాతం ఫిట్ మెంట్ ను ప్రకటించాలని కమిటీకు ప్రతిపాదించారు. ఈమేరకు కమిటీ పలు సిఫా ర్సులతో పీఆర్సీ నివేదికను సిద్ధం చేసింది. ప్రభుత్వం పిలుస్తే నివేదిక ఇవ్వాలని కమిటీ చూస్తోంది. పిలిస్తే ఇస్తామని కమిటీని కలిసిన ఉద్యోగ సంఘాల నేతలతో కమిటీ చెప్పినట్లు ఓ కీలక ఉద్యోగ సంఘం నేత పేర్కొన్నారు.

**ప్రభుత్వంపై రూ. 7,500 కోట్లు భారం..**
**(బాక్స్)**

ఒకవేళ ప్రభుత్వం కమిటీ నుంచి పీఆర్సీ నివేదికను తీసుకుంటే వెంటనే ప్రక్రియను ప్రారంభించాల్సి ఉంటుంది. పీఆర్సీని అమలు చేయాల్సి ఉంటుంది. పీఆర్సీ కమిటీకి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు 51 శాతం ఫిట్ మెంట్ ఇవ్వాలని కోరాయి. రాష్ట్రంలో దాదాపు 15 లక్షల వరకు ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లున్నారు. వీరందరికీ కనీసం 1 శాతం ఫిట్ మెంట్ ఇవ్వాలన్నా దాదాపు నెలకు రూ. 250 నుంచి రూ. 300 కోట్లు కావాల్సి ఉంటుంది. అదే 51 శాతం ఫిట్ మెంట్ అంటే రూ.12,750 కోట్లు భారం ప్రభుత్వంపై పడనుంది.అయితే ఇందులో ప్రభుత్వం ఎంతమేర ఫిట్ మెంట్ ఇస్తుందోననేది చర్చనీయాంశమే. ఒకవేళ 30 శాతమే అయితే రూ. 7,500 కోట్లు ఉద్యోగులకు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నిధులు ఉద్యోగులకు ప్రభుత్వం బకాయి పడ్డట్టే. రెండున్న రేండ్లు కావొస్తున్నా.. పీఆర్సీ అమలు చేయకపోవడంతో ఉద్యోగులు నష్టపోతున్నారని ఉద్యోగ సంఘాలు పేర్కొంటున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు పీఆర్సీని అమలుచేస్తామని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోవడంలేదని ఉద్యోగ సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పీఆర్సీ నివేదిక తెప్పించుకొని మంచి ఫిట్ మెంట్ తో నూతన పీఆర్సీని ప్రభుత్వం ప్రకటించాలని పలు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కొత్తగా ప్రభుత్వం ఏర్పడడంతో అప్పటికే ఉన్న ఆర్థిక ఇబ్బందులను ఉద్యోగ, ఉపాధ్యాయులు అర్థం చేసుకొని రెండేళ్లుగా ప్రభుత్వానికి సహకరిస్తూ వస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేలా తమ కార్యాచరణను ప్రారంభిస్తామని తెలిపారు. డిసెంబర్ 9 తర్వాత తమ కార్యాచరణను మొదలుపెడతామని పీఆర్టీయూ టీఎస్ సంఘం, ఈ ఏడాది చివరి వరకు వేచి చూస్తామని కీలకమైన ఉద్యోగ సంఘం నేత ఒకరు పేర్కొన్నారు.

# పైలట్ ను నిందించలే..

## అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై సుప్రీంకోర్టుకు కేంద్రం క్లారిటీ

**న్యూఢిల్లీ:** అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమాన ప్రమాదానికి సంబంధించి ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (AAIB) సమర్పించిన ప్రాథమిక నివేదికలో పైలట్ తప్పిదమే ప్రమాదానికి కారణమని నిందించలేదని కేంద్ర ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. ఈ మేరకు సుప్రీంకోర్టుకు సెంట్రల్ గవర్నమెంట్ వివరణ ఇచ్చింది. కాగా, 2025, జూన్ 12న గుజరాత్ లోని అహ్మదాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్ బయలుదేరిన ఎయిర్ ఇండియా బోయింగ్ 787 డ్రీమ్ లైనర్ విమానం టేకాఫ్ అయిన నిమిషాల్లోనే కుప్పకూలిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో దాదాపు 270 మంది మరణించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన AAIB.. విమానం ఫ్యూయల్ స్విచ్ లు టేకాఫ్ తర్వాత ఒకేసారి రన్ మోడ్ నుంచి కటాఫ్ కి మారడం వల్లే ప్రమాదం జరిగిందని ప్రాథమిక రిపోర్టులో పేర్కొంది. ఏఏఐబీ ప్రాథమిక రిపోర్ట్ ఆధారంగా.. ఎయిర్ ఇండియా కెప్టెన్ సుమీత్ సబర్వాల్ తప్పిదం వల్లే ఈ ప్రమాదం జరిగిందని నేషనల్ మీడియాలో పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. విచారణ పూర్తి కాకముందే తన కొడుకును బ్లేమ్ చేస్తున్నారంటూ కెప్టెన్ సుమీత్ సబర్వాల్ తండ్రి పుష్కర్ రాజ్ సబర్వాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. రిటైర్డ్ న్యాయమూర్తి పర్యవేక్షణలో న్యాయమైన, పారదర్శకమైన, సాంకేతికంగా దర్యాప్తు జరపాలని కోరారు. ఈ పిటిషన్ పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రాథమిక విచారణ ఆధారంగా పైలట్లను నిందించడం దురదృష్టకరమని మండిపడింది.పైలట్లలో ఒకరు ఆత్మహత్య చేసుకున్నారని సూచించే మీడియా నివేదికలను చాలా బాధ్యతారహితమైనవిగా పేర్కొంది. ప్రాథమిక నివేదిక ఆధారంగా పైలట్లను నిందిస్తే.. తుది విచారణలో వారి తప్పు లేదని తేలితే ఏం చేస్తారని ప్రశ్నించింది. అనంతరం కేంద్ర ప్రభుత్వం, డీజీసీఏకు అఫిడవిట్ దాఖలు చేయాలని దేశ అత్యున్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టు నోటీసులకు తాజాగా కేంద్ర ప్రభుత్వం సమాధానమిచ్చింది. ఏఏఐబీ ప్రాథమిక నివేదికలో పైలట్ తప్పిదమే ప్రమాదానికి కారణమని నిందించలేదని పేర్కొంది.

## బంగ్లాదేశ్ లో మళ్లీ అల్లర్లు..



**బంగ్లాదేశ్ :** పొరుగు దేశం బంగ్లాదేశ్ లో మళ్లీ అల్లర్లు చెలరేగాయి. మరోసారి యువత ఆగ్రహానికి గురైంది. కొన్ని నెలల క్రితం దేశవ్యాప్త ఆందోళనలతో ప్రభుత్వాన్ని కూలదోసిన అదే యువశక్తి ఇప్పుడు మహమ్మద్ యూనస్‌నేతృత్వంలో నడుస్తున్న ప్రభుత్వంపై తిరగబడింది..గత ప్రభుత్వం చేసిన తప్పే యూనస్‌తాత్కాలిక ప్రభుత్వం కూడా చేస్తుందని యువత మరోసారి ఆందోళనకు దిగింది. బంగ్లాదేశ్ మరోసారి యువత ఆగ్రహాన్ని చవిచూసింది. గతంలో దేశ రాజకీయ స్వరూపాన్నే మార్చేసి అదే యువ శక్తి ఇప్పుడు ప్రధాన సలహాదారు యూనస్ తాత్కాలిక ప్రభుత్వంపై విరుచుకుపడింది. పాఠశాలల్లో మ్యూజిక్, పీఈటీ టీచర్ పోస్టులను రద్దు చేయడంతో తిరుగుబాటు చేశారు. ఈ వార్తలు వచ్చిన వెంటనే ఢాకా నుంచి చిట్టగాంగ్ వరకు దేశవ్యాప్తంగా యూనివర్సిటీల క్యాంపస్ లలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు.పాఠశాలల్లో మ్యూజిక్‌ను నిశ్శబ్ద పర్చవచ్చునే మోగానీ మా హృదయాల్లోకాదు అంటూ నినాదాలు చేస్తే వీధుల్లో భారీ ర్యాలీలు నిర్వహించారు. బంగ్లాదేశ్ సాంస్కృతిక గుర్తింపును రక్షించడమే లక్ష్యంగా యువత రోడ్లపై కి వచ్చినట్లు తెలుస్తోంది. ఆందోళన క్రమంలో బంగ్లాదేశ్ వీధుల్లో హింస చెలరేగింది. ఢాకాలోని కొన్ని ప్రాంతాలలో లాక్ డౌన్ విధించారు. ఇది బంగ్లాదేశ్ లో పెరుగుతున్న అశాంతిని ఆజ్యం పోసింది. కేవలం పరిపాలనపరమైన నిర్ణయానికి వ్యతిరేకంగా కాకుండా యూనస్ తాత్కాలిక ప్రభుత్వంలో ఇస్లామీకరణ చేయడంపై యుద్ధంగా విద్యార్థులు ,సాంస్కృతిక గ్రూపులు ఈ నిరసనలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

## మా వాళ్లకు శిక్షణ ఇవ్వండి





**అమెరికా:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్రమ వలసలు, ఇమ్మిగ్రేషన్ విధానాలపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. దీంతో పాటు H-1B వీసా విధానంపై అనేక కొత్త నిబంధనలు తీసుకువస్తున్నాడు. H-1B వీసాల ద్వారా విదేశీయులు, అమెరికన్ల ఉద్యోగాలను కొల్లగొడుతున్నారని అధికార రిపబ్లికన్ పార్టీ సభ్యులు ఆరోపిస్తున్నారు. H-1B వీసాలపై అమెరికా ఏ కఠిన నిర్ణయం తీసుకున్నా, ఇది భారతీయులపై ప్రభావాన్ని చూపిస్తుంది. ఈ వీసాల కింద అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న వారిలో 70 శాతం మంది ఇండియన్స్ ఉన్నారు.అయితే, డొనాల్డ్ ట్రంప్ H-1B వీసాలపై కొత్త విధానానికి రెడీ అవుతున్నాడు. విదేశీ వర్కర్లపై ఎక్కువగా ఆధారపడకుండా, అధిక నైపుణ్యం కలిగిన ఉద్యోగాల కోసం అమెరికన్లకు శిక్షణ ఇవ్వడానికి విదేశీ నిపుణుల్ని కొంత కాలం పాటు అమెరికాలోకి అనుమతించేందుకు సిద్ధమైనట్లు ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ అన్నారు. అమెరికాలో కొన్ని రంగాల్లో విదేశీ ప్రతిభను తీసుకురావాల్సిన అవసరం ఉందని ట్రంప్ చెప్పిన తర్వాత ఈ వ్యాఖ్యలు వచ్చాయి. దీని ప్రకారం, కొత్త H-1B వీసా విధానంలో విదేశీ నిపుణులు ముందుగా అమెరికాకు వచ్చి, అక్కడి స్థానికులకు శిక్షణ ఇచ్చి, మళ్లీ తిరిగి సొంతదేశాలకు వెళ్లాల్సి ఉంటుంది. అమెరికన్లకు ట్రైనింగ్ ఇవ్వడానికి మూడు, ఐదు లేదా ఏడు ఏళ్లు నైపుణ్యం కలిగిన విదేశీ కార్మికుల్ని అమెరికాలోకి అనుమతించాలని ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ భావిస్తోంది.

## అమెరికాలో ముగిసిన షట్‌డౌన్..



**అమెరికా:** అమెరికాలో ఎట్టకేలకు సుదీర్ఘ షట్ డౌన్ ముగిసింది. ఈ మేరకు 222-209 ఓట్ల తేడాతో అమెరికా కాంగ్రెస్ ఆమోదించింది. షట్ డౌన్ ను ముగించే ప్రభుత్వ ఫండింగ్ బిల్లుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం రాత్రి సంతకం చేశారు. దీంతో 43 రోజుల సుదీర్ఘ షట్ డౌన్ కు అధికారికంగా ముగింపు లభించింది.అమెరికా చరిత్రలోనే అత్యధిక కాలం ఆర్థిక ‘షట్ డౌన్ ’ కొనసాగింది. షట్ డౌన్ కారణంగా ఉద్యోగులు, కార్మికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జీతాలు లేక కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతం అయ్యారు. ఇక విమానాశ్రయాల్లో కూడా అనేక మంది ప్రయాణికులు ఇక్కట్లు పడ్డారు. ఇక ఫుడ్ సెంటర్ల దగ్గరైతే పెద్ద క్యూ లైన్లు చోటుచేసుకున్నాయి. ఇలా అన్ని వర్గాల వారు షట్ డౌన్ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## సయ్యద్ ఇంట్లో గుజరాత్ ఏటీఎస్ పోలీసుల సోదాలు..



**రంగారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ లో మంగళవారం అర్ధరాత్రి గుజరాత్ ఏటీఎస్ పోలీస్ సోదాలు కలకలం సృష్టించాయి. ఫోర్త్ వ్యూ కాలనీలోని డాక్టర్ సయ్యద్ మొహియుదిన్ ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యుల బృందం సోదాల్లో పాల్గొంది. మూడు రకాల లిక్విడ్ లతో పాటు కంప్యూటర్, పలు రకాల బుక్స్, ఆయిల్ తయారు చేసే మిషన్ సహా పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. సయ్యద్ సోదరుడు ఓమర్ ఫారుఖీకి నోటీసులు ఇచ్చి సెర్చ్ నిర్వహించారు. అనంతరం సామాగ్రిని సీజ్ చేశారు.ఇదిలా ఉండగా.. భారతదేశంలో పెను విధ్వంసం సృష్టించేందుకు కుట్ర పన్నారనే ఆరోపణలపై హైదరాబాద్ కు చెందిన డాక్టర్ సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్ ను గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) పోలీసులు ఆదివారం గుజరాత్ లోని బనస్కాంత జిల్లాలో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. మొహియుద్దీన్ అరెస్టుపై కుటుంబ సభ్యులు ఇటీవల స్పందించారు. మొహియుద్దీన్ సోదరుడు ఒమర్ ఫారూఖీ నిన్న(బుధవారం) ఎన్టీవీతో మాట్లాడాడు. తన సోదరుడు మంచోడని, ఎవరో కావాలనే కుట్రలో ఇరికించారని ఆవేదన వ్యక్తం చేశాడు. తన బ్రదర్ ఉగ్రవాద కార్యకలాపాలతో లింక్స్ ఉన్నట్లు తెలియదని చెప్పాడు. ఒకవేళ తమ సోదరుడు తప్పు చేస్తే కఠినంగా శిక్షించండని ఒమర్ ఫారూఖీ అంటున్నాడు. ‘మా సోదరుడు మొహియుద్దీన్ ఎవరో ట్రాప్ చేసి ఈ కుట్రలో ఇరికించారు. మా బ్రదర్ కు ఉగ్రవాద కార్యకలాపాలతో లింక్స్ ఉన్నట్లు మాకు తెలియదు. నవంబర్ 5న బిజినెస్ డీల్ ఉందని చెప్పి ఇంట్లో నుంచి గుజరాత్ బయల్దేరాడు. 9వ తేదీన ఏటీఎస్ వారు నాకు ఫోన్ చేసి మీ బ్రదర్ కు ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయని, అరెస్ట్ చేశాం అని చెప్పారు. మొహియుద్దీన్ నివాసాన్ని ముట్టొద్దు, 2 రోజుల్లో వచ్చి ఆయన రూమ్ లో ఉన్న సామగ్రి స్వాధీనం చేసుకుంటాం అని ఏటీఎస్ పోలీస్ చెప్పారు. ఇంటికి ఏటీఎస్ పోలీసులు వచ్చారు, సామాన్లు సీజ్ చేసి తీసుకువెళ్లారు. ఏటీఎస్ అరెస్టు చేసినవారిలో మరో ఇద్దరు ఆజాద్ సులేమాన్ షేక్, మొహమ్మద్ సుహైల్ వారితో మాకు ఎలాంటి లింక్స్ లేవు’ అని అన్నాడు.

# కేటీపీపీలో ఇంటి దొంగలు..

## సెక్యూరిటీ కళ్లు కప్పి అందిన కాడికి దోచేస్తున్నారు

- ఇటీవల రూ. లక్షల విలువైన కాపర్‌వైర్ చోరీ
- ఘటనలపై నిర్లక్ష్యంగా ఉంటున్న అధికారులు
- 3 నెలల్లో నలుగురు ఆర్టిజన్లపై సస్పెన్షన్ వేటు
- ప్లాంటు సెక్యూరిటీ వింగ్ లో కొరవడిన నిఘా
- వరుస చోరీలతో అందినకాడికి మాయం
- ఐదు నెలల కింద క్వార్టర్స్ లోంచి ఎత్తుకెళ్లిన సొత్తు

**జయశంకర్‌భూపాలపల్లి,ఫ్లాష్ ఇండియా :** కాకతీయ థర్మల్ పవర్‌ప్రాజెక్టు(కేటీపీపీ)లో ఇంటి దొంగల ఆగడాలు పెరిగిపోతున్నాయి. సెక్యూరిటీ కళ్లు కప్పి అందిన కాడికి దోచేస్తున్నారు. రూ. లక్షల విలువైన సామగ్రిని ఎత్తుకెళ్తున్నారు. కొన్నాళ్లుగా చోరీలు జరుగుతుండగా అధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారు. గత సమ్మర్ లో కేటీపీపీ ఏరియాలో కార్మికుల క్వార్టర్స్ లోని 7 ఇండ్లలో ఒకేసారి చోరీలు జరిగాయి. ఓ ఏడీ ఆఫీసర్ ఇంట్లో రూ. 2 లక్షల సొత్తు, మిగతా ఇండ్లలోనూ విలువైన సొమ్ములను ఎత్తుకెళ్లారు. ఇటీవల రూ. లక్షల విలువైన కాపర్‌వైర్‌మాయమైన ఘటన ఆలస్యంగా తెలియడంతో చర్చనీయాంశమైంది. ఇంటి దొంగల సపోర్ట్ లేకుండా బయటి వ్యక్తులు కేటీపీపీలోకి వచ్చే చాన్స్ లేదు. చోరీల వెనక ఇంటి దొంగల హస్తం తప్పక ఉంటుందని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఘటనలపై నిర్లక్ష్యంగా ఉంటున్న అధికారుల తీరును విమర్శిస్తున్నారు.

**పూర్తిస్థాయి నిఘా లేకపోగా..**

జయశంకర్‌భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూర్‌వద్ద కాకతీయ థర్మల్‌పవర్ ప్రాజెక్టు(కేటీపీపీ)ను 1100 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించారు. ప్లాంటు ఇంజనీర్లు, కార్మికులు, ఉద్యోగులు, సిబ్బంది కలిపి సుమారు 2 వేల మందికిపైగా విధులు నిర్వహిస్తుంటారు. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నిఘా లేకపోవడంతో దొంగలు లోపలికి వెళ్లి విలువైన వస్తువులను మాయం చేస్తున్నారని కార్మికులు పేర్కొంటున్నారు. బయటకు ఏయే వస్తువులు పోతున్నాయో తెలుసుకోకుండా ఉన్నతాధికారులకు నిర్లక్ష్యంగా ఉంటున్నాని విమర్శిస్తున్నారు. రెండేండ్ల కింద స్టోర్‌రూమ్ లో నిల్వ చేసిన రూ. కోట్ల విలువైన సామగ్రిని ఇంటి దొంగలు మాయం చేశారు. కాగా.. ఐదు నెలల కింద కొంపెల్లి శివారు వైపు నుంచి ప్లాంట్ కాంపౌండ్ వాల్స్ కు చీరలు కట్టుకుని లోపలికి వచ్చారు. తాళాలు వేసిన ఇండ్లను టార్గెట్ చేసి చోరీలకు పాల్పడ్డారు. క్వార్టర్స్ కు చెందిన కొందరి సపోర్ట్ లేకుండా వచ్చేందుకు వీలు లేదు. ఇటీవల ప్లాంటులో రూ. లక్షల విలువైన కాపర్‌వైర్ మాయమైన ఘటనను ఆలస్యంగా అధికారులు గుర్తించారు. సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా ఇంటి దొంగల పనిగా తేల్చారు. 3 నెలల కింద ఇద్దరు, తాజాగా మరో ఇద్దరు ఆర్టిజన్లపై సస్పెన్షన్‌వేటు వేశారు. భారీ వస్తువుల మాయంపై కొందరు ఆఫీసర్లను బాధ్యులుగా గుర్తించి బదిలీలు చేశారు. అయినా ప్రాజెక్టులో చోరీలు ఆగడం లేదు. బయటపడ్డవి కొన్నే అయినా ఇంకా బయటకు రానివి చాలానే ఉంటాయని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఘటనలపై లేటుగా మేల్కొంటున్న ఆఫీసర్లు పోలీసులకు ఫిర్యాదులు చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప సీరియస్‌యాక్షన్ తీసుకోవడంలేదనే విమర్శలు చేస్తున్నారు. ఇటీవల కొత్తగా వచ్చిన ఆర్టిజన్ ఓ ఆఫీసర్‌తో దురుసుగా ప్రవర్తించడంతో పాటు ప్లాంటులో మాయమైన కాపర్‌వైర్ కు బాధ్యుడిగా చేస్తూ అతనిపై సస్పెన్షన్‌వేటు వేసినట్టు కార్మికుల్లో చర్చ జరుగుతోంది.

**ప్లాంట్ ఇంజనీరే ఇన్ చార్జ్ ఎస్‌వో..**

పోలీస్‌శాఖ నుంచి డీఎస్పీ క్యాడర్‌ఆఫీసర్‌ఎస్‌వో(సెక్యూరిటీ ఆఫీసర్)గా విజిలెన్స్,సెక్యూరిటీ విభాగాలతో నిఘా ఉంటుంది. ప్రధానంగా ప్లాంటు తొలి, రెండో గేట్ల వద్ద ఉన్న నిఘా పూర్తిస్థాయిలో లేకపోవడాన్ని గుర్తించిన కొందరు విలువైన వస్తువులను, కాపర్‌వైర్‌ను కాంపౌండ్ వాల్ మీదుగా బయటకు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దుబ్బపల్లి వైపు నుంచి ప్లాంట్ ను ఆనుకుని ఉన్న చెరువు దగ్గర నుంచి లోపలికి వస్తున్నారనే టాక్‌ఉంది. కాగా.. ఏడాదిగా సెక్యూరిటీ ఆఫీసర్(ఎస్‌వో) లేకపోవడంతో ప్లాంట్ ఇంజనీరే ఇన్ చార్జ్ గా ఉన్నారు. దీంతో ప్లాంటులోని అన్ని పనులను పూర్తిస్థాయిలో తెలుసుకోలేకపోతున్నారని కార్మికులు పేర్కొంటున్నానరు. నిఘా వ్యవస్థను కమాండ్‌చేయలేక పోవడం, ప్లాంటుకు కీలకమైన సెక్యూరిటీ వింగ్ లో శాఖకు సంబంధంలేని ఇంజనీర్‌పెత్తనం చేస్తుండడంతోనే వరుస చోరీలు జరుగుతున్నాయని కార్మికులు ఆరోపిస్తున్నారు. ముందస్తు వ్యూహంతో నిఘా పెట్టలేకపోతున్నారంటున్నారు. 100మందికి పైగా సెక్యూరిటీ ఉండాల్సి ఉండగా, కేవలం70 మందే డ్యూటీలో ఉంటున్నారు. ఇందులో 10 మంది తాడిచర్ల కోల్ చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్నారు. మిగతా 60 మందితోనే నిఘా కొనసాగిస్తున్నారు. రాత్రిపూట సెక్యూరిటీ నిఘా సరిగా లేకపోవడంతోనే చోరీ ఘటనలు జరుగుతున్నాయని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పటిష్ట నిఘాను పెంచి ఇంటి దొంగలను పట్టాలని, డీఎస్పీ క్యాడర్ ఆఫీసర్ ను వెంటనే నియమించి పటిష్ట బందోబస్తు ఉండేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

## ఉచిత మెగా హెల్త్ క్యాంప్ ప్రజలకు మేలు



**మక్తల్,ఫ్లాష్ ఇండియా :** మారుమూల గ్రామాల్లో అరుదైన వ్యాధులకు ఉచిత మెగా హెల్త్ క్యాంపు వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని, ఇలాంటి ఉచిత వైద్య క్యాంపులు నిర్వహించేందుకు ముందుకు రావాలని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం సంగంబండ గ్రామంలో బికేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా హెల్త్ క్యాంప్ ను మంత్రి వాకిటి శ్రీహరి, నేరేడ్గమ్ మఠం పంచమ సిద్ధ లింగేశ్వర స్వామి ప్రారంభించారు. ఈ క్యాంప్ లో 7 రకాల ఉచిత వైద్య సేవలు అందించడంతో పాటు ఉచితంగా వందల మంది రోగులకు విలువైన మందులను పంపిణీ చేయడం జరిగింది.మానవ సేవే మాధవ సేవ అని భావించి ఉచిత మెగా క్యాంపులు నిర్వహించడం వల్ల దూర ప్రాంతాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేసుకోవడానికి ఇబ్బంది పడే పేద ప్రజలకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ఈ ప్రాంత వాసిని తాను రియల్ ఎస్టేట్ వ్యాపారిగా ఎదిగానని తనకు స్థిర సంపాదన వచ్చిందని కానీ అందులో తృప్తి లేదని పేదలకు సేవ చేయడంలో ఉన్న తృప్తిని గుర్తించి తను సేవా కార్యక్రమాలను ప్రారంభించామని ఇప్పటి వరకు బి.ఆర్.కే ఫౌండేషన్ ద్వారా ఇలాంటి క్యాంప్స్ నిర్వహించా అని మరిన్ని ఉచిత వైద్య మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి ప్రజలకు మరింత సేవ చేస్తానని బి కే ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్ర వ్యాప్తంగా విజిలెన్స్ దాడులు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో విజిలెన్స్ ఎన్ఫోర్స్ మెంట్ అధికారుల చేపట్టిన ఆకస్మిక దాడులతో భారీగా అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. రైస్ మిల్లర్లు కోట్లాది రూపాయల విలువ చేసే సీఎంఆర్ ధాన్యం దారిమళ్లినట్టు అధికారులు గుర్తించారు. ఆదిలాబాద్ జిల్లా నిర్మల్, రంగారెడ్డి జిల్లా శంషాబాద్, మహబూబ్ నగర్, సంగారెడ్డి, వనపర్తి జిల్లాల్లో నిర్వహించిన తనిఖీల్లో ధాన్యం బస్తాలు మాయం అయినట్లు గుర్తించారు.నిర్మల్ జిల్లా కడెం ప్రాంతంలో రైస్ మిల్లర్లు భారీగా సీఎంఆర్ ధాన్యాన్ని దారి మళ్ళించారనే విశ్వసనీయ సమాచారం అందడంతో కరీంనగర్ విజిలెన్స్ యూనిట్ ఈ నెల 11వ తేదీన కట్టా బాలాజీ రైస్ మిల్ లో సోదాలు నిర్వహించగా ఇందులో 2024-25 రబీ సీజన్ కు సంబంధించి 2684 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ధాన్యం స్టాక్ దారి మళ్లించారని దీని విలువ 6.22 కోట్లు ఉంటుందని గుర్తించారు. సదరు మిల్లు యజమానిపై తదుపరి చర్యలు తీసుకునేలా పౌరసరఫరాల శాఖకు సమాచారం ఇచ్చారు. ఇక ఆర్ సిపురం ఎన్ ఫోర్స్ మెంట్ యూనిట్ పౌర సరఫరాల శాఖతో కలిసి సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం డాకూర్ లోని ఎం/ఎస్ కన్యకా పరమేశ్వరి ఆగ్రో ఇండస్ట్రీస్ లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ దాడిలో రబీ 2024-25 సీజన్ కు సంబంధించిన 3752.80 క్వింటాళ్ల సీఎంఆర్ ధాన్యం (382 బస్తాలు) తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. దీని విలువ సుమారు రూ.87,06,496 ఉంటుందని సదరు మిల్లు యజమానిపై తదుపరి చర్యలు ప్రారంభించడానికి సంగారెడ్డి జిల్లా పౌర సరఫరాల విభాగానికి సిఫార్సు చేశారు. ఈనెల 12వ తేదీన వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్ల గ్రామంలోని చాముండి రైస్ మిల్లు, వరాహి రైస్ మిల్లుల్లో ఎన్ ఫోర్స్ మెంట్ డీఎస్పీ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. రబీ, ఖరీఫ్ 2024-25 సీజన్ కు సంబంధించిన మొత్తం 1,47,375 బస్తాల సీఎంఆర్ ధాన్యం స్టాకును దారి మళ్లించినట్లు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ. 13.67 కోట్ల ఉంటుందని తెలిపారు. ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని రాష్ట్రస్థాయి అధికారులకు నివేదించనున్నట్లు ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు తెలిపారు.హైదరాబాద్ రూరల్ యూనిట్ అధికారులు ఈ నెల 11వ తేదీన శంషాబాద్ నుండి మహబూబ్ నగర్ కు పీడీఎస్ బియ్యాన్ని రవాణా చేస్తున్న ఒక డీసీఎం వాహనాన్ని అడ్డుకున్నారు. సైబరాబాద్ పరిధిలోని శంషాబాద్ పీఎస్ పరిమితులలోని పెద్ద షాపూర్ గ్రామం సమీపంలో జాతీయ రహదారి-44పై సుమారు రూ. 5 లక్షల విలువ చేసే 15 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం క్రిమినల్ కేసుతో పాటు ఈసీ చట్టం కింద 6ఏ కేసు నమోదు చేయాలని పౌర సరఫరాల అధికారికి సిఫార్సు చేశారు. అదే రోజున హైదరాబాద్ సిటీ-2 యూనిట్ అధికారులు రవాణా మరియు మైనింగ్ శాఖ అధికారులతో కలిసి భూత్పూర్, జడ్చర్ల నుండి కొడంగల్ వరకు ఉన్న రాష్ట్ర రహదారిపై రూట్ లో నిర్వహించిన తనిఖీల్లో అధిక లోడ్ తో వెళ్తున్న వాహనానికి రూ. 2,80,000జరిమానా విధించారు. రాయల్టీ ఉల్లంఘించినందుకు రూ.40 వేలు జరిమానా విధించారు. అలాగే సరైన పత్రాలు లేని రూ. 2 లక్షల విలువ కలిగిన ఒక వాటర్ ట్యాంకర్ ట్రాలీని స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో మొత్తం 17 వాహనాలను స్వాధీనం చేసుకుని వాటిని నాగర్ కర్నూల్ జిల్లా కర్వకుర్తి, తాడూరు పోలీస్ స్టేషన్లకు అలాగే మహబూబ్ నగర్ జిల్లాలోని జడ్చర్ల ఫైర్ స్టేషన్ కు తరలించారు. ధాన్యం దారి మళ్లిస్తున్నట్లు గుర్తిస్తే టోల్-ఫ్రీ నంబర్ 14432 కు ఫోన్ చేసి విజిలెన్స్ ఎన్ ఫోర్స్ మెంట్ కు సమాచారం అందించాలని తెలంగాణ విజిలెన్స్ ఎన్ ఫోర్స్ మెట్ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు

# కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది




**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** రాజ్యాంగ సవరణ చేసైనా బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలనీ బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్ డిమాండ్ చేశారు. మిర్యాలగూడ పట్టణంలో ఏర్పాటు చేసిన బీసీల ధర్మ పోరాట దీక్షకు అఖిల పక్ష పార్టీల నాయకులు మద్దతు పలికారు.బీసీలకు విద్య ఉద్యోగ రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అధ్వర్యంలో బీసీల ధర్మ పోరాట దీక్ష చేశారు.ఈ దీక్షకు అఖిల పక్ష పార్టీల నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు.దీక్షను ఉద్దేశించి ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉందనీ అన్నారు.బీసీ రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో ఆమోదించి రాష్ట్రపతి ఆమోదానికి పంపించిన కూడా నెలల తరబడి బిల్లు గురించి పట్టించుకోవడం లేదని తెలిపారు. బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదించాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలో ధర్నా చేసిన కూడా కేంద్రం ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు.బీసీల కోసం కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్ తీసుకొస్తుంటే బిజెపి కావాలని కాలయాపన చేస్తుందని అన్నారు. బీసీలకు బిజెపి వ్యతిరేకత అని ఆరోపించారు.కేంద్రంలో మంత్రులుగా ఉన్న కిషన్ రెడ్డి, బండి సంజయ్ బీసీ రిజర్వేషన్ బిల్లుపై అభిప్రాయం చెప్పాలన్నారు.బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంటు సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రైవేట్ బీసీ బిల్లు పెట్టాలని అన్నారు.బీసీ బిల్లును బీసీ ప్రధాని అయిన నరేంద్ర మోడీ ఆమోదించి బీసీల న్యాయమైన రిజర్వేషన్ల డిమాండ్ ను ఆమోదించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు,ఎర్రబెల్లి దుర్గయ్య,మహేష్ గౌడ్, సందెనబోయిన జయమ్మ,బంటు కవిత,జానపాటి రవి,డాక్టర్ రాజు,బీజేపీ పట్టణ అధ్యక్షుడు బంటు గిరి,అంబేద్కర్ యువజన సంఘం కొమ్ము శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎండి షోయబ్,సోములు,పొదిలి శ్రీనివాస్,సయ్యద్ ఫరూక్,గాజుల శ్రీనివాస్,చిలుకూరి బాలు, పోలగాని వెంకటేష్,వజ్రగిరి అంజయ్య,సిపిఐ ధనుంజయ నాయుడు,సైదులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ గంజాయి సేవిస్తున్న

## నలుగురు నిందితుల అరెస్ట్, పరారీలో ఒకరు..

### గంజాయి,మాదకద్రవ్యాలు అమ్మడం కొనడం సేవించడం చట్టరీత్య నేరం డిఎస్పి రాజశేఖర్ రాజు




**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** అక్రమ గంజాయి కలిగి ఉండి మరియు సేవిస్తున్న నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేయడం జరిగింది.గురువారం మిర్యాలగూడ డిఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పి రాజశేఖర్ రాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ప్రతిష్టాత్మకంగా తీసుకొన్న మాదక ద్రవ్యాల నిర్మూలన మరియు మిషన్ పరివర్తనలో భాగంగా నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా మరియు గంజాయి మాదకద్రవ్యాల అక్రమ రవాణా పై ఉక్కుపాదం మోపి నిరంతర నిఘాలో బాగంగా గురువారం ఉదయం 10 గంటల సమయంలో త్రిపురారం గ్రామ శివారులో గంగదేవరమ్మ గుడి వద్ద కొంతమంది సేవిచడం కొరకు గంజాయి తెచ్చుకున్నారన్న నమ్మదగిన సమాచారము మేరకు త్రిపురారం పోలీస్ స్టేషన్ కు చెందిన ఎస్సై కె.నరేష్ సిబ్బందితో వెళ్ళి 4 యువకులను గంజాయి కలిగి వున్న కవర్ తో వుండగా పట్టుబడిచేసి వారి వద్ద నుండి ఒక నీలం రంగు పాలిథిన్ కవర్ లో ఉన్నమొత్తం 1.6 KG బరువు కలిగిన గంజాయి ప్యాకెట్ ను మరియు 3 సెల్ ఫోన్ లను1100 రూపాయలు నగదు మరియు ఒక బైక్ ను స్వాధీన పరచుకొనైనదని తెలిపారునిందితుల వివరాలు కొమ్మెర శివ నివాసం మాచర్ల టౌన్ పల్నాడు జిల్లా,పిల్లి మణికంఠ నివాసము ముది మాణిక్యం గ్రామము అడవీదేవులపల్లి మండలం,దండు వినోద్ నివాసము పెద్దేవులపల్లి గ్రామం మాడుగులపల్లి మండలం,బండి కొటేష్ నివాసము పెద్దదేవలపల్లి గ్రామము మాడుగుల పల్లి మండలం,మరియు చల్లా అంజి నివాసం మాచర్ల పట్టణం పరారీలో ఉన్నాడని తెలిపారు.పై నిందితులైన మణికంఠ,వినోద్ మరియు కోటేష్ లు స్నేహితులు వీరంతా కలిసి గంజాయి త్రాగేవాళ్ళు వీరికీ మాచర్లకు చెందిన శివ అనే వ్యక్తి తన స్నేహితుడైన చల్లా అంజి వద్ద నుండి గంజాయి కొనుగోలు చేసి అమ్ముతుండేవాడు.ఎప్పటిలానే గంజాయి అమ్ముతుండగా పోలీస్ వారు పట్టుబడిచేసినారని తెలిపారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు పర్యవేక్షణ లో ఈ కేసు ను చేదించడం లో ప్రత్యేక ప్రతిభ కనపరిచిన హాలియా సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీసు డి.సతీష్ రెడ్డి,త్రిపురారం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీసు కె నరేష్, హెడ్ కానిస్టేబుల్ వీరయ్య,పోలీసు కానిస్టేబుల్స్ శ్రీను,చంద్రశేఖర్,నాగేశ్వర రావు,ఆర్ శ్రీనివాస్ మరియు హోంగార్డు లు రఫీ,చంద్ పాషా,ఇబ్రాహీం,కవిత లను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ ప్రత్యేకంగా అభినందించడం జరిగింది.

## ఎమ్మెల్యే చొరవతో తుంగపాడు మోడల్ స్కూల్ కు ప్రత్యేక బస్సు






**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** మిర్యాలగూడ మండలం తుంగపాడు నందు గల మోడల్ స్కూల్ విద్యార్థులు బస్సు సౌకర్యం లేక గురువారం ఆటో లలో గుంపులుగా వెళ్తున్న విద్యార్థులను అటుగా వెళ్తున్న మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి చూసి ఆటోనీ ఆపి విద్యార్థులతో మాట్లాడడం జరిగింది. అసలే రోజులు బాగా లేక ఎన్నో ఆక్సిడెంట్లు అవుతున్న విషయాన్ని గుర్తు చేస్తూ వెంటనే మిర్యాలగూడ ఆర్టీసీ డిఎం కి ఫోన్ చేసి రేపటి నుంచి ఉదయం 8:30 వరకు మిర్యాలగూడ బస్టాండ్ లో మోడల్ స్కూల్ విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం మోడల్ స్కూల్ వద్దకి వెళ్లి ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి రేపటి నుంచి ఉదయం మోడల్ స్కూల్ విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తునట్టు విద్యార్థులకు అందరికీ తెలియజేయాలని సూచించారు.వారి ఈ నిర్ణయం పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేసారు.



## మిర్యాలగూడ కోర్టు ఆవరణలో న్యాయవాదుల విధుల బహిష్కరణ...

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** నిర్మల్ న్యాయస్థానం పరిసరాల్లో న్యాయవాది పి.అనిల్ కుమార్ గారి వాహనాన్ని పోలీసులు ధ్వంసం చేసిన ఘటనను నిరసిస్తూ మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నేతి సత్యనారాయణ,జనరల్ సెక్రటరీ అలుగుబెల్లి భూపతి రెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి,ధర్నా చేసారు.ప్రెసిడెంట్,జనరల్ సెక్రటరీ మాట్లాడుతూ పోలీసుల అమానుష చర్య న్యాయవృత్తి, ఆత్మగౌరవం,స్వాతంత్ర్యం పట్ల నేరుగా చేసిన దాడిగా భావించి. బాధ్యులైన పోలీస్ సిబ్బంది పై తక్షణమే కఠిన చర్యలు తీసుకోనుటకు ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ మరియు బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ తక్షణమే స్పందించి బాధిత న్యాయవాదికి అండగా ఉండాలని డిమాండ్ చేశారు.కార్యక్రమం లో న్యాయవాదులు కొంక వెంకన్న, గంగా భవాని,కర్ణం లింగయ్య, కుమార్ రెడ్డి, పెంటా రెడ్డి,పలిరెడ్డి రమణా రెడ్డి,రెడ్డిపల్లి సైదులు, కిరణ్ కుమార్ రెడ్డి,ఉమా శంకర్, యల్లయ్య,ఆర్. భాస్కర్, గూడురు శ్రీనివాస్,పరమేష్, రంగా రావు,పెదమాం కిరణ్ రమేష్ నాయక్,వాగ్యా,రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

## కాళోజిని స్ఫూర్తిగా తీసుకోవాలి



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు కోసం,తెలుగు భాషా బలోపేతం కోసం కాళోజి నారాయణరావు చేసిన కృషి నేటి యూవతకు స్ఫూర్తిదాయకమని సామాజిక వేత్త డాక్టర్ రాజు,మరో గ్రంధాలయం ఉద్యమ కర్త కస్తూరి ప్రభాకర్,బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మాలోత్ దశరథ్ నాయక్,యాదవ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి చెగొండి మురళి యాదవ్ లు అన్నారు.గురువారం కాళోజి నారాయణ రావ్ వర్ధంతి సందర్భంగా మిర్యాలగూడలోని మేరెడ్డి రాంచంద్రారెడ్డి గ్రంధాలయం లో వారు చిత్రపటానికి పూలదండ వేసి మాట్లాడారు.ఆంధ్రుల పాలనలో తెలంగాణకు జరుగుతున్న నష్టాలను పాటల రూపంలో రాసి ప్రజలను చైతన్యపరిచారు. తెలుగు భాషా పరిరక్షణ కోసం అనేక గ్రంధాలను రాసి అవహగాహన కల్పించారు. అయన ఆశయం సాధన కోసం యువత కృషి చేయాలనీ కోరారు. కార్యక్రమంలో కుమ్మరికుంట్ల సుధాకర్,లవన్, క్రాంతి,వెంకటేష్, నాగార్జున,అఖిల్,రాంబాబు, సూర్య,నాగరాజు,పవన్,మధు, విజయలక్ష్మి,మమత,గాయత్రి, చందన,సునీత తదితరులు పాల్గొన్నారు.



# షెడ్యూల్‌ను మార్చిన పీసీబీ

జింబాబ్వే, శ్రీలంక, పాకిస్తాన్.. ముక్కోణపు సిరీస్ ఆడనున్న విషయం తెలిసిందే. దీనికి పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తుంది. తాజాగా ఈ వేదికను పీసీబీ ఇస్లామాబాద్ నుంచి రావల్పిండికి తరలించింది. ఇటీవల ఇస్లామాబాద్ లో బాంబు పేలుడు సంభవించడమే దీనికి కారణమని తెలుస్తోంది. ఈ సిరీస్ కు సంబంధించి మార్పులు చేసిన షెడ్యూల్ ను పాకిస్తాన్ క్రికెట్ బోర్డు గురువారం విడుదల చేసింది.

**అఫ్గానిస్తాన్ పాల్గొనాల్సింది.. కానీ!**

ఇస్లామాబాద్‌లో బాంబు పేలుడు నేపథ్యంలో తమ ఆటగాళ్లు పాక్‌ను విడిచి స్వదేశానికి రావడానికి విజ్ఞప్తి చేస్తున్నారని శ్రీలంక క్రికెట్ బోర్డు(SLC) తెలిపింది. వాస్తవానికి ఈ సిరీస్‌లో మొదట ఈ సిరీస్‌లో జింబాబ్వే స్థానంలో అఫ్గానిస్తాన్ పాల్గొనాల్సి ఉంది. కానీ గత నెలలో పాక్ జరిపిన వైమానిక దాడుల్లో తమ దేశానికి చెందిన ముగ్గురు దేశవాళీ క్రికెటర్లు మృతి చెందడంతో అఫ్గానిస్తాన్ ఈ సిరీస్ నుంచి తప్పుకుంది. అయితే శ్రీలంక ఆటగాళ్లు స్వదేశానికి బయలు దేరనున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న పాకిస్తాన్, శ్రీలంక వన్డే సిరీస్, త్వరలో ప్రారంభం కానున్న ముక్కోణపు సిరీస్ నిర్వహణపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**ముక్కోణపు సిరీస్ షెడ్యూల్ ఇదే..**

18 నవంబర్: పాకిస్థాన్ vs జింబాబ్వే
20 నవంబర్: శ్రీలంక vs జింబాబ్వే
22 నవంబర్: పాకిస్థాన్ vs శ్రీలంక
23 నవంబర్: పాకిస్థాన్ vs జింబాబ్వే
25 నవంబర్: శ్రీలంక vs జింబాబ్వే
27 నవంబర్: పాకిస్థాన్ vs శ్రీలంక
29 నవంబర్: ఫైనల్

# రిషబ్ పంత్ ఆసక్తికర వ్యాఖ్యలు!



శుక్రవారం (నవంబర్ 14) నుంచి కోల్ కతాలోని ఈడెన్ గార్డెన్స్ లో భారత్, దక్షిణాఫ్రికా మధ్య మొదటి టెస్ట్ మ్యాచ్ ఆరంభం కానుంది. ఈ మ్యాచ్ లో టీమిండియా వికెట్ కీపర్ , బ్యాటర్ రిషబ్ పంత్ ఆడనున్నాడు. ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్ లో భాగంగా మాంచెస్టర్ వేదికగా జరిగిన నాలుగో మ్యాచ్ లో పంత్ కాలికి గాయమైంది. గాయం కారణంగా దాదాపు నాలుగు నెలలు జట్టుకు దూరమైన అతడు కోల్ కతా టెస్టుతో అంతర్జాతీయ క్రికెట్ లోకి పునరాగమనం చేస్తున్నాడు. వైస్ కెప్టెన్ కూడా అయిన పంత్ కు టీమిండియా ప్లేయింగ్ 11లో చోటు ఖాయం. మొదటి టెస్టు నేపథ్యంలో పంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.గాయం తర్వాత తిరిగి మైదానంలో అడుగుపెట్టడం అనుకున్నంత తేలిక కాదని రిషబ్ పంత్ అంటున్నాడు. ఆ దేవుడు ఎంతో దయగలవాడని, చాలాసార్లు తనను ఆశీర్వదించాడని పేర్కొన్నాడు. 'గాయం తర్వాత అంతర్జాతీయ క్రికెట్ లోకి పునరాగమనం చేయడం చాలా కష్టం. కానీ ఆ దేవుడు ఎంతో దయగలవాడు. నన్ను ఎన్నోసార్లు ఆశీర్వదించాడు. ఈసారి కూడా నన్ను కరుణించాడు. మైదానంలోకి తిరిగి రావడం పట్టలేని ఆనందంగా ఉంది. గాయం నుంచి కోలుకొనే సమయంలో నా పేరెంట్స్, సన్నిహితులు.. అందరూ నాకు మద్దతుగా నిలిచారు. వారికి నా ధన్యవాదాలు' అని పంత్ చెప్పాడు.అదృష్టం మన చేతుల్లో ఉండదని.. నియంత్రణలో ఉన్న విషయాల మీదే తాను దృష్టిపెడతా అని రిషబ్ పంత్ చెబుతున్నాడు. మనకు నచ్చే పనులనే చేస్తూ ఉండాలని, ఏ పని చేసినా ఆస్వాదిస్తూ చేయాలన్నాడు. మనం చేసే పని మీద 100 శాతం ఎఫర్ట్స్ పెట్టాలని పంత్ అంటున్నాడు. దక్షిణాఫ్రికా ఏతో జరిగిన తొలి అనధికారిక మ్యాచ్ లో పంత్ దారుణంగా విఫలమయ్యాడు. 20 బంతుల్లోనే ఔటై అభిమానులను నిరాశపర్చాడు. కోల్ కతా టెస్టులో రాణించాలని ఫాన్స్ కోరుకుంటున్నారు.

# నీ వీడియోను వైరల్ చేస్తా..



భారత యువ క్రికెటర్ విప్రజ్ నిగమ్ ఓ సమస్యలో చిక్కుకున్నాడు. ఐపీఎల్ లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున ఆడుతున్న విప్రజ్ ను ఓ మహిళ బ్లాక్ మెయిలింగ్ కు గురిచేస్తోంది. గత రెండు నెలలుగా సదరు మహిళ అనుచిత డిమాండ్లు చేస్తోందని, తాను అంగీకరించకపోతే ప్రైవేట్ వీడియోలు వైరల్ చేస్తానని బెదిరిస్తోందని తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. విప్రజ్ ఫిర్యాదు మేరకు ఉత్తరప్రదేశ్ లోని బారాబంకి జిల్లాలోని కొత్వాలి నగర్ లో ఎఫ్ ఐఆర్ నమోదయింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.నివేదికల ప్రకారం... విప్రజ్ నిగమ్ కు 2025 సెప్టెంబర్ లో బెదిరింపు, మెసేజులు రావడం ప్రారంభమయ్యాయి. ప్రారంభంలో వేధింపులు ఒకే మొబైల్ నంబర్ నుంచి వచ్చాయి. విప్రజ్ ఆ నంబర్ బ్లాక్ చేసిన తర్వాత.. అనేక అంతర్జాతీయ నంబర్ ల ద్వారా బెదిరింపులు కొనసాగాయి. తన డిమాండ్లను ఒప్పుకోకుంటే తప్పుడు క్రిమినల్ కేసుల్లో ఇరికిస్తానని బెదిరించింది. కాల్స్ లో విప్రజ్ సహా అతని కుటుంబాన్ని బహిరంగంగా అవమానిస్తామని హెచ్చరించింది. నకిలీ వీడియోలతో బెదిరింపులన్నీ తన క్రికెట్ కెరీర్ ను నాశనం చేయడానికి, మానసికంగా కృంగదీయడానికే అని విప్రజ్ ఎఫ్ ఐఆర్లో పేర్కొన్నాడు. కాల్ డేటా, మెసేజ్ ల ద్వారా దర్యాప్తు చేసేందుకు సైబర్ సెల్ సాయం కూడా కొత్వాలి నగర్ పోలీసులు తీసుకుంటున్నారు. బెదిరింపు చేసేది ఇంతకీ అమ్మాయా? లేదా అబ్బాయా అని ఇంకా తెలియరాలేదు.ఐపీఎల్ 2025 సీజన్ కు ముందు ఢిల్లీ క్యాపిటల్స్ విప్రజ్ నిగమ్ ని రూ.50 లక్షలకు తీసుకుంది. 21 ఏళ్ల ఈ ఆల్ రౌండర్ తన తొలి సీజన్ లోనే బ్యాట్, బంతితో అద్భుతమైన ప్రదర్శన చేశాడు. 14 మ్యాచ్ లలో 142 పరుగులు, 11 వికెట్లు పడగొట్టాడు. అతను ఇప్పుడు ఇండియా A, దక్షిణాఫ్రికా A మధ్య ఈరోజు ప్రారంభమయ్యే వన్డే సిరీస్ లో ఆడనున్నాడు. ఉత్తరప్రదేశ్ జట్టు తరఫున దేశవాళీ క్రికెట్ ఆడుతున్నాడు. ఐదు ఫస్ట్-క్లాస్ మ్యాచ్ లలో 19 వికెట్లు పడగొట్టాడు, 116 పరుగులు చేశాడు. ఆరు లిస్ట్ A మ్యాచ్ లలో నాలుగు వికెట్లు, 35 పరుగులు కూడా చేశాడు. 21 టీ20 మ్యాచ్ లలో 206 పరుగులు, 19 వికెట్లు పడగొట్టాడు.

# ఎంఎస్ ధోనీ, విరాట్ కోహ్లీ..



ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్ 2025ను భారత జట్టు సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. 47 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ హర్మన్ ప్రీత్ సేన ఛాంపియన్ గా అవతరించింది. ఫైనల్లో దక్షిణాఫ్రికాను ఓడించి మెగా ట్రోఫీని తొలిసారి ముద్దాడింది. టోర్నీలోని లీగ్ దశలో వరుసగా మూడు మ్యాచుల్లో పరాజయం తర్వాత టీమిండియా అద్భుతంగా పుంజుకుని.. సెమీస్ చేరింది. సెమీఫైనల్లో పటిష్ట ఆస్ట్రేలియాను, ఫైనల్ లో దక్షిణాఫ్రికాను ఓడించి విశ్వవిజేతగా నిలిచింది. ట్రోఫీ గెలిచిన భారత జట్టుపై ప్రశంసల జల్లుతో పాటు భారీ నజరానాలు కూడా కురిశాయి.టీమిండియా మహిళలు వరుస కార్యక్రమాలు, ఇంటర్వ్యూలల్లో పాల్గొంటున్నారు. ఈ క్రమంలో కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ చెన్నైలోని ఓ స్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె అక్కడి విద్యార్థులు ముచ్చటించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు హర్మన్ ప్రీత్ సమాధానాలు ఇచ్చారు. ఎంఎస్ ధోనీ, విరాట్ కోహ్లీలలో మీ ఫేవరెట్ క్రికెటర్ ఎవరు? అని ఓ స్టూడెంట్ అడగగా.. ధోనీ అని తక్కువ సమాధానం ఇచ్చింది. అలానే మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తనకు స్ఫూర్తిదాయకమని చెప్పింది. తనకు టెస్ట్ ఫార్మాట్ అంటే ఇష్టమని మరో విద్యార్థికి ఆన్సర్ ఇచ్చింది. మెగా టోర్నీలో హర్మన్ బ్యాటర్ గా, కెప్టెన్ గా రాణించింది.

# ఒంటరి తల్లిగా జీవించడం సులభం కాదు..



భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా, తన భర్త పాకిస్తాన్ స్టార్ క్రికెట్ అయిన షోయబ్ మాలిక్ వ్యక్తిగత కారణాలతో విడాకులు తీసుకున్న విషయం తెలిసిందే. అయితే నాటి నుంచి తన కుమారుడితో ఒంటరిగా జీవిస్తుంది. కాగా ఒంటరి తల్లిగా జీవించడం సులభం కాదని, విడాకుల జీవితంపై సానియా మీర్జా చేసిన కీలక వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్ గా మారాయి. తన వ్యక్తిగత జీవితంపై అరుదుగా మాట్లాడే ఆమె.. తాజాగా దర్శకురాలు ఫరా ఖాన్ నిర్వహించిన పాడ్ కాస్ట్ లో తన మనసు విప్పారు. "ఒంటరి తల్లిగా జీవించడం చాలా కష్టం. ప్రతి రోజు ఒక కొత్త సవాల్ ఎదురవుతుంది" అని సానియా వెల్లడించారు. విడాకుల తర్వాత తన కుమారుడు ఇజ్హాన్ కి తల్లి, తండ్రి బాధ్యతలను తానె భరిస్తున్నానని చెప్పారు.గతంలో పానిక్ అటాక్ వచ్చిన సమయంలో ఫరా ఖాన్ తనకు బలంగా అండగా నిలిచిందని గుర్తుచేశారు. దీనిపై ఫరా ఖాన్ కూడా సానియా ధైర్యాన్ని, బలాన్ని ప్రశంసిస్తూ "ఆమె నిజమైన ఫైటర్ . జీవితంలో ఎంత ఒత్తిడిని ఎదుర్కొన్నా ధైర్యం గా నిలబడుతుంది" అని వ్యాఖ్యానించారు. విడాకుల ప్రభావం పిల్లలపై తప్పక ఉంటుందని సానియా కూడా అంగీకరించారు. "తల్లి, తండ్రి కలిసి ఉండడం పిల్లల కోసం ఉత్తమం. కానీ జీవిత పరిస్థితులు ఎప్పుడూ మనకు అనుకూలంగా ఉండవు" అని ఆమె చెప్పింది. ప్రస్తుతం సానియా తన కుమారుడితో హైదరాబాదులో స్థిరపడుతూ, కొత్త జీవన మార్గాన్ని ధైర్యంగా ముందుకు తీసుకెళ్తున్నారు.

# బిజినెస్

## దేశంలో మొట్టమొదటి ఎంబెడెడ్ స్మార్ట్ టైర్లను..




భారతీయ ఆటోమొబైల్ పరిశ్రమ ఇప్పుడు "ఇంటెలిజెంట్ మొబిలిటీ" యొక్క కొత్త యుగంలోకి ప్రవేశించింది. JK టైర్ & ఇండస్ట్రీస్ లిమిటెడ్ దేశంలో మొట్టమొదటి ఎంబెడెడ్ స్మార్ట్ టైర్లను విడుదల చేసింది. ప్రయాణీకుల వాహనాల కోసం రూపొందించబడిన ఈ ఆవిష్కరణ, కేవలం టైర్ లాగానే కాకుండా "స్మార్ట్ మెషిన్" లాగా పనిచేస్తుంది. ఈ టైర్లు వాహన పనితీరు, భద్రత, ఇంధన సామర్థ్యాన్ని పర్యవేక్షిస్తాయని కంపెనీ పేర్కొంది.ఈ స్మార్ట్ టైర్ ను తామే అభివృద్ధి చేసినట్లు JK టైర్ సంస్థ తెలిపింది. మధ్యప్రదేశ్ లోని బాన్ మోర్ లోని తన తయారీ కర్మాగారంలో కంపెనీ దీనిని ఉత్పత్తి చేస్తున్నట్లు వెల్లడించింది. ఈ టైర్లలో గాలి పీడనం, ఉష్ణోగ్రత సంభావ్య గాలి లీకేజీలు వంటి సమాచారాన్ని కనిపెట్టే సెన్సార్లు అమర్చబడి ఉంటాయని.. ఈ డేటా డ్రైవర్ ను ఆ సమయంలో హెచ్చరిస్తుందని సంస్థ వివరించింది. ఇది రహదారి భద్రత, నిర్వహణ ఇంధన సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుందని పేర్కొంది. ఈ సాంకేతికత టైర్ల జీవితకాలాన్ని పొడిగించడానికి, ఇంధన సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, పర్యావరణ ప్రభావాన్ని తగ్గించడానికి కూడా సహాయపడుతుంది.JK టైర్ విజయం కేవలం ఒక ఉత్పత్తి ఆవిష్కరణ మాత్రమే కాదు, "ఆత్మనిర్భర్ భారత్" (మేక్ ఇన్ ఇండియా) కి ఒక ప్రకాశవంతమైన ఉదాహరణ కూడా అంటూ కంపెనీ యాజమాన్యం తెలిపింది.. ఎంబెడెడ్ స్మార్ట్ టైర్ ఆవిష్కరణ జెకె టైర్ ఆవిష్కరణ ప్రయాణంలో ఒక కీలకమైన మైలురాయని.. జేకే టైర్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రఘుపతి సింఘానియా అన్నారు. ఈ స్మార్ట్ టైర్లను మొదటగా ఆఫ్టర్ మార్కెట్ కోసం విడుదల చేసినట్లు తెలిపారు. ఈ స్మార్ట్ టైర్లు 14 అంగుళాల నుండి 17 అంగుళాల వరకు సైజుల్లో లభిస్తాయని.. . ఈ టైర్లను కాంపాక్ట్ కార్ల నుండి ప్రీమియం సెడాన్ల వరకు వాహనాలలో ఉపయోగించవచ్చన్నారు. వీటి ధరలకు సంబంధించి.. కంపెనీ నుంచి ఎలాంటి సమాచారం లేదు.

# సిమెంట్ రంగంలో రూ 1.2 లక్షల కోట్ల పెట్టుబడులు


దేశీయ సిమెంట్ పరిశ్రమ మంచి జోరు మీదుంది. గత మూడేళ్లుగా గిరాకీ ఏటా సగటున 9.5 చొప్పున పెరుగుతోంది. పెరుగుతున్న గిరాకీని తట్టుకునేందుకు కంపెనీలు ఉత్పత్తి సామర్థ్య విస్తరణ, కొత్త ప్లాంట్ల ఏర్పాటుకు సిద్ధమయ్యాయి. వచ్చే మూడేళ్లలో కంపెనీలు ఇందుకోసం ఎంతలేదన్నా రూ.1.2 లక్షల కోట్ల వరకు ఖర్చు చేస్తాయని రేటింగ్ సంస్థ క్రిసిల్ అంచనా. గత మూడేళ్లతో పోలిస్తే ఇది 50 ఎక్కువ. ఈ విస్తరణ, నూతన ప్రాజెక్టులతో వచ్చే మూడేళ్లలో (2026-28) అదనంగా మరో 16 నుంచి 17 కోట్ల టన్నుల గ్రైండింగ్ సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని కూడా అంచనా వేసింది. గత మూడేళ్లలో నమోదైన 9.5 కోట్ల అదనపు ఉత్పత్తి సామర్థ్యంతో పోలిస్తే ఇది 75 ఎక్కువ. దీంతో ప్రస్తుతం 66.8 కోట్ల టన్నులుగా ఉన్న కంపెనీల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 2028 మార్చి నాటికి 82.8 లేదా 83.8 కోట్ల టన్నులకు పెరుగుతుందని పేర్కొంది. అయితే కొత్తగా అందుబాటులోకి వచ్చే ఉత్పత్తి సామర్థ్యంలో 65 ఇప్పటికే ఉత్పత్తిలో ఉన్న ప్లాంట్ల సామర్థ్య విస్తరణ ద్వారా వస్తుందని, ఈ కారణంగా పెట్టుబడి వ్యయాలు మరీ అంత భారీగా ఉండకపోవచ్చని క్రిసిల్ పేర్కొంది. ఈ కొత్త పెట్టుబడుల్లో 10 నుంచి 15 పెట్టుబడులను సిమెంట్ కంపెనీలు సొంత ఇంధన అవసరాల కోసం ఏర్పాటు చేసే హరిత ఇంధన ప్రాజెక్టులు, ఉత్పత్తి ఖర్చులు తగ్గించే ప్రాజెక్టులపై ఖర్చు చేయబోతున్నాయి. దీంతో కంపెనీల అప్పుల భారం సైతం స్థిరంగా ఉండి, వాటి లాభాలకూ పెద్దగా ఇబ్బంది ఉండకపోవచ్చని క్రిసిల్ తెలిపింది.

**కలిసొచ్చే అంశాలు**

వచ్చే మూడేళ్లలో దేశీయ సిమెంట్ పరిశ్రమకు పలు సానుకూల అంశాలు కలిసి రానున్నాయి. మౌలిక సదుపాయాలు, గృహ నిర్మాణ రంగాలపై పెరుగుతున్న పెట్టుబడులు ఇందుకు ప్రధానంగా కలిసి రానున్నాయి. దీంతో అదానీల నిర్వహలోని అంబుజా సిమెంట్, ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీలు పెద్ద ఎత్తున విస్తరణ చేపట్టాయి. ఇందుకోసం కొత్త ప్లాంట్ల ఏర్పాటు, సామర్థ్య విస్తరణతో పాటు ఆయా రాష్ట్రాల్లో బలంగా ఉన్న చిన్న చిన్న సిమెంట్ కంపెనీలను కొనేస్తున్నాయి. దీంతో ఈ ఏడాది మార్చి నాటికి ఉన్న 66.8 కోట్ల టన్నుల స్థాపిత సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యంలో 85 శాతం 17 కంపెనీల చేతుల్లో కేంద్రీకృతమైంది. గత పదేళ్లుగా సిమెంట్ రంగంలో ఉత్పత్తి సామర్థ్య వినియోగం సగటున 65u మాత్రమే. అయితే పెరుగుతున్న డిమాండ్‌తో ఇది గత ఆర్థిక సంవత్సరం 70 శాతానికి చేరిందని క్రిసిల్ తెలిపింది.



# పసిడి ప్రియులకు ఊహించని షాక్



ఇటీవలి రోజుల్లో బంగారం ధరలు వరుసగా పెరుగుతూ లక్షా 35 వేలకు చేరువైంది. అనంతరం వరుసగా తగ్గుతూ లక్ష 22 వేలకు చేరింది. పసిడి ధరలు తగ్గాయని సంతోషించే లోపే మరలా షాక్ ఇస్తున్నాయి. నవంబర్ 10, 11 తేదీల్లో భారీగా పెరిగిన గోల్డ్ రేట్స్.. నిన్న స్వల్పంగా తగ్గాయి. ఈరోజు బంగారం ధరలు భారీగా పెరిగాయి. బులియన్ మార్కెట్ లో 24 క్యారెట్ల 1 గ్రాము పసిడి ధర రూ.229 పెరిగి.. రూ.12,780 వద్ద ట్రేడ్ అవుతోంది. 22 క్యారెట్ల 1 గ్రాము ధర రూ.210 పెరిగి.. 11,715గా కొనసాగుతోంది.గురువారం బులియన్ మార్కెట్ లో 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేట్ రూ.1,27,800గా.. 22 క్యారెట్ల ధర రూ.1,17,150గా నమోదయింది. నిన్నటితో పోల్చుకుంటే 24 క్యారెట్లపై రూ.2,290.. 22 క్యారెట్లపై రూ.2,100 పెరిగింది. హైదరాబాద్ మార్కెట్ లో స్వచ్ఛమైన 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,27,800 వద్ద ట్రేడ్ అవుతోంది. 22 క్యారట్ల 10 గ్రాముల రేటు రూ.1,17,150గా పలుకుతోంది. విశాఖ, విజయవాడలో ఇవే రేట్స్ కొనసాగుతున్నాయి.ఇక వెండి ధర మాత్రం నేడు ఊహించని షాక్ ఇచ్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా 10 వేలు పెరిగింది. ఈరోజు బులియన్ మార్కెట్ లో కిలో వెండిపై రూ.10,000 పెరిగి.. రూ.1,72,000 వద్ద ట్రేడ్ అవుతోంది. హైదరాబాద్ నగరంలో కిలో వెండి రూ.1,82,000గా నమోదైంది. విశాఖ, విజయవాడలో కూడా రూ.1,82,000గా కొనసాగుతోంది. ప్రాంతాల వారీగా బంగారం, వెండి ధరల్లో హెచ్చుతగ్గులు ఉంటాయన్న విషయం గుర్తుంచుకోవాలి.

# కస్టమర్లకు షాకిచ్చిన కోటక్




కోటక్ మహీంద్రా బ్యాంక్ కస్టమర్లకు షాకిచ్చింది. డిసెంబర్ 2025 నుంచి తన కస్టమర్లకు ట్రాన్సాక్షన్స్ అలర్ట్ కోసం ప్రతి SMS కి ఛార్జ్ వసూలు చేయడం ప్రారంభించబోతోంది. నిర్వహణ ఖర్చులను భరించే లక్ష్యంతో, బ్యాంక్ వినియోగదారులకు వారి ఖాతా కార్యకలాపాల గురించి సకాలంలో అప్‌డేట్స్ ను అందించడం కొనసాగించాలని చూస్తోంది. నెలకు 30 అలర్ట్స్ ఉచిత పరిమితి ఉంటుంది. ఆ తర్వాత SMS కి రూ.0.15 వసూలు చేస్తామని కోటక్ మహీంద్రా బ్యాంక్ తెలిపింది.ఒక నెలలో 30 లావాదేవీలకు సంబంధించిన SMS హెచ్చరికల పరిమితిని బ్యాంక్ అధిగమించాల్సి వస్తే, ప్రతి అదనపు సందేశానికి SMS కి రూ.0.15 ఛార్జ్ విధించనుంది. కస్టమర్లకు పంపబడే SMS హెచ్చరికలు వివిధ లావాదేవీల గురించి వారికి తెలియజేయడానికి ఉద్దేశించినవి. తద్వారా వినియోగదారులు వారి బ్యాంకింగ్ కార్యకలాపాల గురించి సమాచారం పొందడంలో సహాయపడతారు.అయితే, SMS హెచ్చరికల ఛార్జీల నుండి తప్పించుకోవడానికి ఒక మార్గం ఉంది. కస్టమర్ సేవింగ్ లేదా శాలరీ ఖాతాలో రూ. 10,000 లేదా అంతకంటే ఎక్కువ బ్యాలెన్స్ ఉంటే ఛార్జీలు వర్తించవు. ఈ స్టాండర్డ్స్ లో నెలవారీ సగటు బ్యాలెన్స్, టర్మ్ డిపాజిట్లు లేదా కస్టమర్ రెగ్యులర్ శాలరీ క్రెడిట్ లను పొందినట్లయితే కూడా ఛార్జీలు ఉంటాయి. 811 ఖాతాలకు, ఛార్జ్-ఫ్రీగా ఉండటానికి అవసరమైన మొత్తం బ్యాలెన్స్ రూ. 5,000 లేదా అంతకంటే ఎక్కువ. ఇందులో నెలవారీ సగటు బ్యాలెన్స్, టర్మ్ డిపాజిట్లు కూడా ఉంటాయి.




# ప్రేమ జంట మధ్యలోకి పోలీస్

తాజాగా టీజర్ రిలీజ్ చేశారు మేకర్స్. 'కొన్ని కథలు చెప్పడానికే ఉంటాయి.. ఇది అనుభూతి చెందడానికి.. ఒక నిశ్శబ్ద ప్రేమకథలోని అత్యంత పెద్దా వార్ ను అనుభవించడానికి సిద్ధంగా ఉండండి' అంటూ షేర్ చేసిన ఈ టీజర్ లో ప్రేమ కోసం ఎంత దూరమైనా వెళ్లే యువకుడిగా రోషన్ కనకాల కనిపించి మెప్పించాడు.ఇక అతడు ప్రేమించే అమ్మాయిగా సాక్షి మడోల్కర్ అల రించనుంది. ఇలా అడవి నేపథ్యంలో సాగే వీరి క్యూట్ ప్రేమ కథలో రావణుడి లాంటి ఓ పోలీస్ ఆఫీసర్ ఎంట్రీ ఇవ్వడం ఆసక్తిని క్రియేట్ చేసింది. ఈ క్రమంలోనే తనకు ఎదురయ్యే సమస్యలను హీరో ఎలా ఎదుర్కొంటాడు.. తన ప్రేమను ఎలా గెలిపించుకుంటాడు అనే దానిపై ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ నెలకొంది. మొత్తంగా ఈ టీజర్ తో సినిమాపై మరింత హైప్ క్రియేట్ అయింది. కాగా.. భారీ అంచనాల మధ్య ఈ మూవీ డిసెంబర్ 12న రిలీజ్ అయ్యేందుకు సిద్ధంగా ఉంది.


# నన్ను ఎవడైనా గెలికితే, రివర్స్ అవుతా



'ది గర్ల్ ఫ్రెండ్' సక్సెస్ మీట్ సందర్భంగా హీరో విజయ్ దేవరకొండ హాట్ కామెంట్ చేశారు. ఇండస్ట్రీలో తనను ఎవరైనా గెలికితే, మామూలుగా ఉండదని వార్నింగ్ ఇచ్చారు విజయ్ దేవరకొండ. వాళ్లకు రివర్స్ గా తాను వ్యవహరి స్తానని హెచ్చ రించారు. అయితే హీరోయిన్ రష్మిక తన లాగా కాదని, చాలా క్యూట్ అంటూ ప్రశంసించారు. 'ది గర్ల్ ఫ్రెండ్' మూవీ సక్సెస్ మీట్ నిన్న జ రుగ గా స్పెషల్ గెస్ట్ గా విజయ్ దేవరకొండ పాల్గొని మాట్లాడారు. కెరీర్ పీక్స్ లో ఉన్న సమయంలో 'ది గర్ల్ ఫ్రెండ్' లాంటి కథలు ఎంచుకోవడం చాలా గొప్ప విషయమని వివరించారు.రష్మిక జర్నీని చూస్తే చాలా గర్వంగా ఉంటుందన్నారు. నిజ జీవితంలో కూడా ఆమె భూమా దేవినే అంటూ వ్యాఖ్యానించారు. ఎవరెన్ని మాటలు అన్నా కూడా, వాటిని లెక్కచేయదని తెలిపారు. వాటిని ప ట్టించుకోకుండా కెరీర్ పైన దృష్టి పెట్టి ముందుకు వెళుతుందని పొగిడారు విజయ్ దేవరకొండ. ఇక ఈవెంట్ ప్రారంభాని కంటే ముందు రష్మికను చూడగానే ఆమె చేతిపై కిస్ పెట్టారు విజయ్ దేవరకొండ. దీనికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు వైరల్ గా మారాయి. దీంతో ఈ జంట త్వరలోనే పెళ్లి చేసుకోబోతుందని, అందుకే విజయ్ కిస్ ఇచ్చి హింట్ ఇచ్చినట్లు సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారు.

# 'మందాకి'నిగా ప్రియాంక చోప్రా..

మహేశ్ బాబు, రాజ మౌళి కాంబినేష న్ లో రాబోతున్న మోస్ట్ వెయిటెడ్ మూవీ 'ఎస్ఎస్ఎంబీ-29'. ఈ ప్రాజెక్ట్ అనౌన్స్ మెంట్ నుంచే సినీ లవర్స్ తో పాటు ప్రేక్షకుల్లో కూడా భారీ ఎక్స్ పెక్టేషన్స్ నెలకొన్నాయి. ఇదిలా ఉంటే.. తాజాగా ఈ మూవీ నుంచి సాలిడ్ అప్డేట్ ఇచ్చాడు డైరెక్టర్ రాజమౌళి. ఇందులో ప్రియాంకా చోప్రా హీరోయిన్ గా నటిస్తుండగా.. ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్ ను రిలీజ్ చేశాడు. 'ప్రపంచ వేదికపై భారతీయ సినిమాను పునర్నిర్వచించిన మహిళ.. దేశీ గర్ల్ ప్రియాంక చోప్రాకు స్వాగతం.. మందాకిని యొక్క లెక్కలేనన్ని షేడ్స్ ప్రపంచం చూసే వరకు వేచి ఉండలేను..' అంటూ ఇందులో ప్రియాంక మందాకి పాత్రలో నటిస్తున్నట్లు తెలిపాడు. ఇక రిలీజ్ చేసిన పోస్టర్ లో రెండు కొండల మధ్యలో చేతిలో గన్ తో పవర్ ఫుల్ లుక్ లో కనిపిస్తూ ఆకట్టుకుంటోంది ప్రియాంక. ప్రజెంట్ ఈ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. కాగా.. పాన్ వరల్డ్ సినిమాగా రూపొందుతోన్న ఈ మూవీలో పృథ్వీ సుకుమారన్ ముఖ్య పాత్రలో నటిస్తున్నాడు.








# నన్ను చాలా మంది చంపాలని చూశారు..

తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ "రిస్క్ ఉన్న పాత్రలు చేసినప్పుడే కెరీర్ కు విలువ పెరుగుతుంది. నా తొలి సినిమా '1920' నుంచే నేను ధైర్యమైన కథలు ఎంచుకుంటున్నాను. కానీ 'ది కేరళ స్టోరీ' నా జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. ఆ సినిమా విడుదలైనప్పుడు దేశంలో సగం మంది నన్ను చంపాలని చూశారు, మిగతా సగం మంది మాత్రం నన్ను రక్షించారు, నాపై ప్రేమ కురిపించారు," అని అదా వెల్లడించారు.అదే సమయంలో, తన తర్వాతి చిత్రం 'బస్తర్: ది నక్సల్ స్టోరీ' సమయంలో కూడా ఇలాంటి పరిస్థితులే ఎదురయ్యాయని తెలిపారు. స్క్రిప్ట్ ఎంపిక గురించి మాట్లాడుతూ అదా అన్నారు .. "నేను ఎప్పుడూ సవాళ్లతో కూడిన పాత్రలు ఎంచుకుంటాను. పాత్రలో భావోద్వేగం లేకపోతే నాకు ఆసక్తి ఉండదు. యాక్షన్ సన్నివేశాలు ఉండాలి. అలాగే, కొన్ని లీటర్ల నీళ్లు తాగి ఏడ్చి నన్ను నేను డీహైడ్రేట్ చేసుకునే అవకాశం ఉండే రోల్స్ అంటే నాకు ఇష్టం. అలాంటి పాత్రలు చేస్తే నా ఫ్యామిలీ కొన్నిసార్లు ఆందోళన చెందుతుంది, కానీ నేను ఆనందిస్తాను," అని చెప్పుకొచ్చారు. తన స్పష్టమైన మాటలతో, బోల్డ్ నిర్ణయాలతో అదా శర్మ మరోసారి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. ప్రస్తుతం ఆమె పలు బలమైన కాన్సెప్ట్ ప్రాజెక్ట్ లలో నటించడానికి సన్నాహాలు చేస్తున్నారు.




# 'అఖండ 2' ఫస్ట్ సింగిల్‌పై మాస్ అప్డేట్..

నందమూరి నటసింహం బాలకృష్ణ హీరోగా, దర్శకుడు బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ "అఖండ 2 : తాండవం" పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈసారి కూడా బాలయ్య మరియు బోయపాటి కాంబో మరోసారి మాస్ మంత్రం వేసేలా ఉన్నారు. ఇక తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ సింగిల్ పై మేకర్స్ క్రేజీ అప్డేట్ ఇచ్చారు.రేపు నవంబర్ 14న సాయంత్రం 5 గంటలకు పీవీఆర్ జుహూ (ముంబై) లో ఈ సాంగ్ ను గ్రాండ్ గా లాంచ్ చేయనున్నారు. ఈ ఈవెంట్ తోనే 'అఖండ 2' ప్రమోషన్స్ పాన్ ఇండియా లెవెల్లో ప్రారంభం కానున్నాయి. ఈ చిత్రానికి ఎస్. థమన్ సంగీతం అందిస్తుండగా, బాలయ్య మాస్ ఎనర్జీకి తగినట్టుగా బ్యాక్ గ్రౌండ్ స్కోర్, పాటలు ఉండబోతున్నాయని టాక్. 14 రీల్స్ ప్లస్ బ్యానర్ పై నిర్మితమవుతున్న ఈ సినిమా డిసెంబర్ 5న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కానుంది. ఫ్యాన్స్ మాత్రం ఇప్పటికే సోషల్ మీడియాలో "తాండవం మొదలైంది" అంటూ ట్రెండ్ మొదలు పెట్టేశారు.




# సర్‌ప్రైజ్ రివీల్ చేసిన రానా..

రానా మాట్లాడుతూ.. "ఈ చిత్రంలో 1957లో విడుదలైన క్లాసిక్ బ్లాక్ బస్టర్ 'మాయా బజార్', అలాగే 'పాతాళ భైరవి' చిత్రాల షూట్ కి ఉపయోగించిన మిచెల్ కెమెరానే మళ్లీ వినియోగించాం. పాతకాలపు విజువల్ టెక్స్చర్ కావాలనే ఉద్దేశంతో ఆ కెమెరాను వాడాం," అని తెలిపారు. ఆ కెమెరా తమ వద్దకు ఎలా వచ్చిందనే విషయాన్ని కూడా రానా వివరించారు. "నా తండ్రి, నిర్మాత దగ్గుబాటి సురేష్ బాబు కొన్నేళ్ల క్రితం వాహిని స్టూడియో నుంచి ఆ మిచెల్ కెమెరాను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పుడు 'కాంత' కోసం దానిని మళ్లీ ఉపయోగించాం. ఆ కెమెరాతో తీసిన ఓ సీన్ ట్రైలర్ లో కూడా ఉంది. అది నాకు చాలా స్పెషల్ గా అనిపించింది" అని రానా చెప్పుకొచ్చారు. ఈ సర్ ప్రైజ్ రివీల్ తో సినిమా చుట్టూ మరింత హైప్ పెరిగింది. మిచెల్ కెమెరాతో చిత్రీకరించిన ఆ విజువల్స్ తెరపై ఎంత మాయ చూపిస్తాయో నవంబర్ 14న సినిమా విడుదలైన తర్వాత చూడాలి.




# 21న తెలుగులో 'ది ఫేస్ ఆఫ్ ది ఫేస్‌లెస్'




వరల్డ్ వైడ్ గా సిల్వర్ స్క్రీన్ పై సెన్సేషనల్ క్రియేట్ చేసి, 2024 ఆస్కార్ అవార్డులకు నామినేట్ అయిన 'ది ఫేస్ ఆఫ్ ది ఫేస్ లెస్' మూవీ తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ట్రై లైట్ క్రియేషన్స్ నిర్మించిన ఈ మూవీని దివ్యవాణి సోషల్ కమ్యూనికేషన్స్ మద్దతుతో ఈ మూవీ నవంబర్ 21న తెలుగు వెర్షన్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ తెలుగు ఫిలించాంబర్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఒకప్పటి హీరో రాజా మాట్లాడుతూ.. ఒకప్పుడు నటుడుగా ఈ ఫిలిమ్ ఛాంబర్ కు వచ్చాను. ఇప్పుడు ఒక పాస్టర్ గా వచ్చాను. క్షమాపణ అనేది అందరి వల్ల అయ్యేది కాదు. క్షమాపణ అనేది గొప్పది. రాణి మారియా త్యాగం గురించి సినిమా ఉంటుంది. ఈ సినిమా ను ప్రతీ ఒక్కరూ ప్రమోట్ చేయాలి. 123 అవార్డులు పొందిన సినిమా ఇది. ఆస్కార్ కు కూడా ఎంట్రీ వచ్చిన సినిమా. నవంబర్ 21న విడుదలయ్యే ఈ సినిమాను ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరు కుంటున్నాను." అని అన్నారు. రాణి మరియా వట్టాలిల్ నిజ జీవిత కథ ఆధారంగా ఈ మూవీ రూపొందించబడింది, ఆమె పేదల అభ్యున్నతి కోసం నిస్వార్థంగా పనిచేసింది. ఈ చిత్రం సీనియర్ రాణి మరియా వట్టలిల్ ఎదుర్కొన్న కష్టాల గురించి. ఆమె అణగారిన వర్గాల కోసం, మహిళా సాధికారత కోసం కృషి చేసింది. ది ఫేస్ ఆఫ్ ది ఫేస్ లెస్ లో విన్సీ అలోషియస్ సీనియర్ రానియా మరియా పాత్రను పోషించారు.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**